# అమ్మమ్మ



కొండముది
సాయికిరణ్ కుమార్


రచయిత కుటుంబం

# అమ్మమ్మ

కొండముది సాయికిరణ్ కుమార్

జె.వి. పబ్లికేషన్స్
హైదరాబాద్

**Ammamma**
by **Kondamudi Saikiran Kumar**

First Edition: January 2017

© Author

For Copies, contact :
**Kondamudi Saikiran Kumar**
Mob : +91 9702911151
Email : kskk@rediffmail.com

Copies: 500

Book Price : Rs. 100/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

DTP & Type Setting:
**K. Ravi Prabha**,
Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothi Valaboju**
Phone: 80963 10140

& All Major Book Shops

అక్షరభిక్ష పెట్టిన అమ్మ, నాన్న
**శ్రీమతి కొండముది నిర్మల,**
**శ్రీ కొండముది లక్ష్మీనరసింహారావుగారు**

ఆధ్యాత్మిక భిక్ష నొసగిన గురుదంపతులు
**శ్రీమతి వడ్లమూడి వసంత,**
**శ్రీ వడ్లమూడి వేంకటేశ్వరరావుగార్లకు**
నమస్సుమనస్సులు

నా సహధర్మచారిణి
**శ్రీమతి కొండముది శైలజ**
పిల్లలు **శరత్ శ్రీకళాకామేశ్వరి, హంసికలకు**
కృతజ్ఞతలతో...

అమ్మమ్మతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికి
ఈ పుస్తకం అంకితం.

**- కొండముది సాయికిరణ్ కుమార్**

# విషయసూచిక


| | |
|---|---|
| ప్రేరణ | 7 |
| అమ్మ ఆశీస్సులు | 10 |
| నాన్నగారి ఆశీస్సులు | 11 |
| భూతి – విభూతి | 13 |
| ముందుమాట | 15 |
| అమ్మమ్మకు నమస్సులతో... | 17 |
| సాయిబాబా చేసిన అద్భుతాలు | 19 |
| ఆ మరో అద్భుతమే అమ్మమ్మ | 22 |
| ముందు నండూరు | 25 |
| అమ్మమ్మ | 30 |
| అమ్మమ్మ – సత్సాంగత్యం | 33 |
| అమ్మమ్మ – కొన్ని మహత్యాలు | 37 |
| అసతోమా సద్గమయ | 41 |
| తమసోమా జ్యోతిర్గమయ | 43 |
| అజ్ఞాన తిమిరాంధస్య | 46 |
| త్వం మూలాధార స్థితోసి నిత్యం | 49 |
| అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం | 52 |
| ఈశావాస్య మిదగ్ం సర్వం | 55 |
| మృత్యోర్మా అమృతంగమయా | 57 |
| కిష్కింధకాండ | 60 |
| ఓం శాంతిః శాంతిః శాంతిః | 62 |

# ప్రేరణ

**శు**క్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే

గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః

నారాయణ సమారంభం వ్యాస శంకర మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం

మా గురువర్యులు శ్రీశ్రీశ్రీ శుకాంబాసహిత శ్రీ శుకానందనాధులకు (గురు దంపతులు శ్రీ వడ్లమూడి వెంకటేశ్వరరావుగారు, శ్రీమతి వడ్లమూడి వసంతగారు) నమో వాకములు.

❋ ❋ ❋

ఆధ్యాత్మికపరంగా నన్ను నేను చాలా అదృష్టవంతుడిగా భావించుకుంటాను. ఆయాచితంగా అందిన వరం అమ్మమ్మైతే, అదృష్టంగా లభించిన వరం మా గురుదేవులు. నాకంటూ ఆధ్యాత్మిక చింతన కలగటానికి మొదటి కారణం అమ్మమ్మ. జీవితాన్నే ఓ తపస్సుగా మార్చుకొని సాయిభక్తిలో పునీతమైన అమ్మమ్మ నాకు ఆధ్యాత్మిక స్ఫూర్తి. సాంప్రదాయేతర దైవంగా అందరూ భావించే సాయిబాబానే నమ్ముకున్నా, సంప్రదాయాలని, సదాచారాలను అమ్మమ్మ ఏనాడు విడనాడలేదు. భౌతికంగా ఉన్నప్పుడు, ఇప్పుడు కూడా చాలామందికి చాలా రకాలైన అనుభూతులు ప్రసాదించింది అమ్మమ్మ. చాలాకాలం వరకు నాకు కలిగిన ఈ

ఆధ్యాత్మిక అనుభవాలను నలుగురితో పంచుకునే సాహసం చేయలేదు. సాహసం అని ఎందుకు అంటున్నానంటే, ఎవరైనా అపహాస్యం చేస్తారేమో అనే బెరుకు, లేదంటే సొంతడబ్బా కొట్టుకుంటున్నాడని అనుకుంటారనే భయం.

దాదాపు అయిదారేళ్ళనుంచి చిన్నమామయ్యతో కొద్దిగా సాన్నిహిత్యం పెరిగింది. ఆధ్యాత్మిక పరిణతికి దోహదపడే విధంగా ప్రోత్సహించారు. అలాంటి ఒక సందర్భంలో, మొదటిసారిగా కొన్ని అనుభవాలు మామయ్యతో పంచుకున్నాను.

నేను ప్రస్తావించిన అనుభవాలను వ్రాసిపెట్టుకోమని, అప్పుడప్పుడు తీసి చదువుకుంటే స్ఫూర్తిప్రదాయకంగా ఉంటుందని మామయ్యే చెప్పారు. అంతే కాకుండా, ఆ మధ్య మరెవరో ప్రచురించదలచిన ఓ పుస్తకానికి నన్ను కూడా అమ్మమ్మతో నాకు కలిగిన ఆధ్యాత్మిక అనుభవాలు పంచుకోమని చెప్పటం జరిగింది. అప్పుడు అంకురించిన ఆ ఆలోచనాబీజం ఇప్పటికి ఒక పుస్తకంగా వస్తున్నది.

ఈ సందర్భంలో మరోమాట కూడా చెప్పాలి. నేను ఏడో, ఎనిమిదో తరగతుల్లో ఉన్నప్పటి సంగతి అనే గుర్తు. అసలు అనుష్ఠానమంటేనే తెలియని నన్ను “ఒరేయి కిష్టి! నువ్వు ఒడుగు చేసుకున్నాక సంధ్యావందనం చేస్తావా? చెవులకు పోగులు పెట్టుకుంటావా, సిగ్గుపడకుండా?” అని అడిగింది అమ్మమ్మ.. తప్పకుండా చేస్తానని చెప్పా. అప్పుడు మరో ముఖ్యమైన మాట కూడా అంది. “చిన్నమామయ్య చక్కగా చేసుకుంటాడు. నువ్వు కూడా మామయ్యలా రోజూ చేసుకో” అని ఆశీర్వదించింది.

అప్పటికి “మామయ్యలా అనుష్ఠానం చేసుకో” అనే మాటకు అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. 1993లో తన్మయిగారు వ్రాసిన శ్రీ సాయిలీలా తరంగిణి చదివేవరకూ మామయ్య ఆధ్యాత్మిక జీవితం గురించి ఏమీ తెలియదు. కానీ గత అయిదారు సంవత్సరాలుగా మామయ్యతో ఆధ్యాత్మిక అనుబంధం పెరిగింది. వెళ్ళిన ప్రతిసారి తను వ్రాసిన పద్యాలు వినిపించేవారు. ఆ పద్యాలలోని ఆత్మనివేదనా భావనకు స్తబ్దుడినయ్యేవాడిని.

ఆధ్యాత్మికమార్గంలో అదృష్టవంతుడిని అనుకోటానికి ఇంకా కొన్ని కారణాలు ఉన్నాయి. ఎన్ని సంవత్సరాలు ఎన్నెన్ని లక్షల జపం చేసిందో అమ్మమ్మ,

ఆ జపమాల నాకు లభించింది. ఇప్పటికి దాదాపు శిథిలావస్థలో ఉంది. అంతేకాదు, మా బామ్మ (మా తాతగారు స్వర్గీయ శ్రీ కొండముది శ్రీ వేంకటేశ్వర్లుగారి ధర్మపత్ని, స్వర్గీయ శ్రీమతి కొండముది అనసూయమ్మగారు) మరెన్నో లక్షల రామమంత్రం చేసిన జపమాల కూడా నాకు లభించింది. వీరిద్దరి ఆశీర్వాదానికి తోడుగా చిన్న మామయ్య కొన్ని దశాబ్దాలు తాను కూర్చుని సాధన చేసుకున్న ఆసనాన్ని అడిగిందే తడవుగా ఆప్యాయంగా అందించారు.

ఈ పుస్తకానికి ప్రేరణ కలిగించినందుకు మామయ్యకు మనఃస్ఫూర్తిగా ధన్యవాదాలు సమర్పిస్తున్నాను.

అడగగానే ఆనందంగా ఆశీస్సులు అందించిన అమ్మ–నాన్నగారికి, మామయ్యకు, అంతే ఆనందంగా ముందుమాట వ్రాసిన అన్నగారు శ్రీ సత్యనారాయణ శర్మగారికి ధన్యవాదాలు. అలానే, కొన్ని విశేషమైన అమ్మమ్మ ఫొటోలు పంచుకున్నందుకు అన్న (చిన్నరాముడు – మునిపల్లె సాయిరామ్)కి కూడా కృతజ్ఞతలు.

✲

# అమ్మ ఆశీస్సులు

**అ**మ్మను చాలా దగ్గరగా చూసింది చూడగలిగింది నేను, లక్ష్మి, చిన్న అన్న. తను పడ్డ కష్టాలకు ఏనాడూ కన్నీళ్ళు పెట్టలేదు అమ్మ. ఆ మానసిక క్షోభ మాకేనాడు తెలియనీయలేదు. కారని ఆ కన్నీటి వెతలు కళ్ళకిందే దాచుకుంది. ఊహించుకోలేనంత చిన్నపిల్లలం కాదు కాబట్టి అర్థం చేసుకున్నాం. ఆవేదన పడ్డాం. అమ్మ బాబాను ఎలా ఆరాధించిందో, అమ్మను అలా ఆరాధించాము. అమ్మ మాటను ఏనాడూ, ఎట్టి పరిస్థితులలోనూ జవదాట లేదు. అమ్మా అని అనుకోవటం వరకే, ఆ తర్వాత మాటలు పెగలవు. ఎన్నెన్నో జ్ఞాపకాల దొంతరల మధ్య చిద్విలాసంగా అమ్మ కనిపిస్తూ ఉంటుంది. ఎదురౌతున్న ప్రతి కష్టంలోనూ నేను వెన్నంటే ఉన్నాననే భరోసా ఇస్తూ తన వెలుగులు ప్రసరిస్తూనే ఉంది అమ్మ. ఇప్పటికీ ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్న అమ్మను తలుచుకుంటూ... కిరణ్‌ని ఆశీర్వదించమని అర్థిస్తూ....

**– అమ్మ (కొండముది నిర్మల)**

# నాన్నగారి ఆశీస్సులు

**అ**మ్మగారిని నేను ఏనాడూ అత్తగారిగా భావించలేదు. అమ్మగారి మూడో అమ్మాయితో (నిర్మల) నా పెళ్ళిచూపుల సందర్భంగా మొట్టమొదటిసారి అమ్మను కలవటం జరిగింది. ఆ సంఘటన ఓ అద్భుతం. పెళ్ళిచూపులు ముగిసాయి. వివాహసంబంధానికి ఇరువైపులా ఒప్పుకున్నారు. పురోహితుల మంత్రోచ్చారణల మధ్య సంబంధం ఖాయం అవుతున్న తరుణంలో అమ్మగారి నుదుట కుంకుమ ఉద్భవించటం మొదలయ్యింది. తీసినకొద్దీ ఆ కుంకుమ వస్తూనే ఉంది. అమ్మగారి ఆ మహత్యాన్ని కళ్ళారా చూసిన సాక్షిని నేను. వివాహమైన దరిమిలా, 1964 నుండి 1974 వరకు దాదాపు పది పదకొండు సంవత్సరాలు అమ్మతోనే ఉన్నాము. అప్పట్లో బ్రాడీపేట అయిదో లైను, రెండో అడ్డరోడ్డులోని జొన్నలగడ్డ ముకుందంగారి ఇంటిలో ఉండేవాళ్ళం.

అమ్మ అనురాగం, ఆప్యాయత, ఆదరణలు జీవితంలో మరిచిపోలేని స్ఫూర్తిని ఇప్పటికీ కలిగిస్తూనే ఉంటాయి. ఏనాడూ కోపతాపాలు కలగని కారుణ్యమూర్తి అమ్మ. అప్పటికి ఏ మాత్రమూ ఉద్యోగభద్రత లేని నన్ను తన కుమారునితోపాటు సమానంగా చూస్తూ, ధైర్యవచనాలు చెబుతూ ఉండేది అమ్మ. చదువుమీద ఎంతో మమకారం ఉన్నా, వివాహం అయ్యేనాటికి నేను చదివింది ఎస్.ఎస్.ఎల్.సి. మరియు టి.ఎస్.ఎల్.సి. నా విద్యాతృష్ణ తెలుసుకొని, పైచదువులకు నన్ను ఎంతగానో ప్రోత్సహించింది అమ్మ.

పిల్లలకు సహజంగా కలిగే దడుపు జ్వరాల నివారణకు నాకో మంత్రం ఇచ్చింది అమ్మ. అదికాక, అమ్మ నాకు ఉపదేశించినది కూడా బాబామీద నమ్మకాన్ని కలిగి ఉండమనే. నమ్మకమంటే ఓ సంఘటన గుర్తుకొస్తున్నది.

1974లో ఆంధ్రాయూనివర్సిటీ నుంచి ఎం.ఎ. తెలుగు చేస్తున్నాను. పరీక్షల ముందు అమ్మ ఆశీర్వాదం తీసుకోగా, పరీక్షలలో పాస్ అవుతావులే, భయపడకుండా వ్రాయమని చెప్పింది అమ్మ. కొన్నాళ్ళకి ఫలితాలు వచ్చాయి. భయపడినట్లే ఓ సబ్జెక్టులో తప్పటం జరిగింది. "అదేంటి, మీరు పాస్ అవుతానని

చెప్పారు, మరి నేనెందుకు తప్పాను?" అని అడిగితే, అమ్మ అన్నారు "ఏం కాదు నరసింహారావ్! బాబా చెప్పాడుగా, నువ్వు పాసయ్యావని. ఇంకా అనుమానం దేనికి? నమ్మకం ఉంచు" అని. ఎదురుగా మార్కుల షీటు కనిపిస్తుంటే, అనుమానం కాక ఇంకేముంటుందని నా బాధ. మరో వారం రోజులకి యూనివర్సిటీనుంచి ఇంటికో ఉత్తరం వచ్చింది. సంక్షిప్తంగా సమాచారం ఏమంటే, ఆ సంవత్సరం ఒక సబ్జెక్టులో చాలామంది తప్పారని, అందుకుగాను, మరో సబ్జెక్టులో ఎక్కువగా మార్కులు వచ్చినవారికి, ఆ మార్కులు ఇందులో కలిపి పాసు చేస్తున్నారని, అందువల్ల, మార్కుల షీటు తిప్పి పంపమని ఆ ఉత్తరం సారాంశం!

ఇటువంటి ప్రత్యేకమైన అనుభవాలు చాలానే ఉన్నాయి. ఏదేమైనా, అమ్మ బోధించిన విధంగా బాబామీద ప్రగాఢ భక్తివిశ్వాసాలు ఉంటే ఆధ్యాత్మిక పురోగతి సాధ్యపడుతుందని నేను ఎరిగిన సత్యం. చిరంజీవి కిరణ్ అమ్మతో తన ఆధ్యాత్మిక అనుభూతులు పుస్తకరూపంలో తీసుకురావటం ఆనందకరం. చల్లనితల్లి అమ్మ ఆశీర్వాదాలు వెన్నంటి ఉండాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ...

**– నాన్న (కొండముది లక్ష్మీనరసింహారావు)**


అమ్మ నాన్నగారు



# భూతి - విభూతి

**ఈ** ఆధ్యాత్మిక అనుభూతుల అనుభవాల కిరణ సుమాల - సుమాలను శ్రీ సాయిదత్త మహాశక్తి అయిన అమ్మ-పూలమ్మ-కామేశ్వరమ్మ గళసీమ నలంకరించగల అదృష్టాన్ని తొలుదొల్త పొందిన ధన్యుడు చిరంజీవి కొండముది సాయికిరణ్ కుమార్. ఈ అదృష్టము, ఈ ధన్యత, ఈ అర్హత, ఈ జన్మలో సాధించినది గాదు. ఈ సంస్కారం ఎన్నియో జన్మల ఆధ్యాత్మిక సాధనల సమాహారం. ఆ పరంపర ఫలాల వెలుగు వెల్లువ.

అమ్మ గారాబంలో నుండి భక్తి అంకురించింది. తండ్రి క్రమశిక్షణ, అమ్మమ్మ ఆపేక్షతో, అమ్మమ్మ దగ్గర గల అతిచనువుతో ఆ అంకురం మొక్కగా వృద్ధి చెంది, భక్తి కుసుమాలు పుష్పించి కుటుంబ వనమంతా పరిమళభరితమై పులకించింది.

సద్గురువుల మంత్రోపదేశంతో ఆ ఆధ్యాత్మిక వృక్షం శాఖోపశాఖలైంది. ఇది భక్తి వైరాగ్యాల సంగమం. ఇక జ్ఞానశిఖరాన్ని అధిష్టించాలి. అప్పుడే కదా పరమార్థానికి పరాకాష్ఠ!

మహా భగదర్శనానుభూతిని పొందిననూ, ఈ వాస్తవమును ఈ పొత్తమున ప్రస్థాపించలేదు. ఈ శక్తినే మహాభగమాలినిగా శ్రీదేవీ ఖడ్గమాల యందు లిఖించి యుండవచ్చును. ఈ అనుభూతి ఉన్నతస్థాయి సోపానమార్గంలో మాత్రమే అనుభవైకం. ఈ ముఖ్య విషయాన్ని, మరిన్ని అనుభూతులను ఆదిభౌతిక ఆధ్యాత్మిక, ఆదిదైవ నియమాలకు లోబడి వివరించి ఉంటే - సాధకులకు ఉపయుక్తముగ నుండెడిది. ఆధ్యాత్మిక అనుభూతుల విషయంలో దివ్య దర్శనముల విషయంలో రాజీ, సిగ్గు, మోమాటపడవద్దని నా సూచన. ఇది కూడా ఒక అహంకారమే కదా!

ఇందు పూలమ్మ గురించి వ్రాసిన విషయములన్నియు చాలామంది సుజనులకు సుపరిచితమే! కిరణ్ అనుభూతులు మాత్రం అతని స్వంతం. ఇతరులకు క్రొత్త. తన మనసు తెరచి అక్షర రూపమున పాఠకులకు విందు

సమకూర్చుటమేగాక, తన జీవితములోని ఆధ్యాత్మిక పరిణామముల వివిధ దశలను తనకు తెలియకుండా తానే సవివరముగా సరళముగా సున్నితముగా భావితరాలకు మార్గదర్శకముగా మలచుట సామాన్యమైన విషయము కాదు. అందుకు ఎంతయో శ్రమ, పరిశ్రమ, తీవ్ర తపన, తాపత్రయం అవసరం. రచయిత వినయవినమ్రశీలి, విద్యాశాలి, మితభాషి, మృదుభాషి, నిరాడంబరుడు, సాత్విక సాత్వికంబైన సాత్విక తత్త్వవేత్త, భావుకుడు. కావుననే చెప్పదలచిన అంశాలను, సారాంశాలను, సూటిగా చక్కని పదజాలంతో విమర్శనాత్మకంగా చదువరులను ఆకట్టుకొనే విధంగా రచన సాగించగల దిట్ట అని నిరూపించుకోవటం జరిగింది. పదాల ఆడంబరానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వకుండా అవసరము ననుసరించి ఆంగ్ల పదప్రయోగాలతో చదువరుల సౌలభ్యానికే పెద్దపీట వేయటం జరిగింది.

తరించాలనే తీవ్రతపన, నిరంతర సాధన - సత్ప్రవర్తన - ఇంతకంటే అర్హతలేం కావాలి, గమ్యాన్ని చేరటానికి! వీటిని తన స్వంతం చేసుకున్న ఈ చిరంజీవి సాధించలేనిది ఏముంటుంది? రాబోయే ఆధ్యాత్మిక బంగారు భవిష్యత్తులో...

తన సాధనా తపస్సులతో ఈ చిరంజీవి వాంఛిత గమ్యాన్ని చేరాలని, చేరగలడని అభిలషిస్తూ.. ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాను - ఇలా...

పరమపదంబు ముక్తులకు, భావన గమ్యము జ్ఞానరాశికిన్,
స్థిరమగు సన్నిధానము, విశిష్ట విశేష సకామ భక్తికిన్
హరిహర నీరజోద్భవ మహామహులందరి మూలశక్తి, నిన్
కరుణను బ్రోవదేమి! శివగౌరి యపేక్ష కుపేక్ష యుండునే!

నిరంతర పరమాత్మ చింతనతో...

బుధజన విధేయుడు

**చుండూరు సీతారామమూర్తి**

గుంటూరు

15-సెప్టెంబరు-2016

# ముందుమాట

**త**మ్ముడు కొండముది సాయికిరణ్ ఎంతో భక్తితో తాను వ్రాసిన 'అమ్మమ్మ' పుస్తకానికి ముందుమాట వ్రాసే అదృష్టాన్ని నాకు కలిగించాడు. అమ్మమ్మ – తమ్ముడికి అమ్మమ్మ గనుక నాకు కూడా అమ్మమ్మే.

బ్రాహ్మణ వంశములన్నీ ఋషివంశములే. నేటి బ్రాహ్మణులలో అనేకులు ఆచార భ్రష్టులై, ఈషణాత్రయములలో చిక్కి తమ మూలాలను మరచి పోతున్నప్పటికీ, ఇప్పటికి కూడా వారిలో ఆ ఋషిరక్తం ప్రవహిస్తూనే ఉన్నదనడానికి, వారి కుటుంబాలలో ఋషితుల్యులైన మహనీయులు అక్కడక్కడా ఇప్పటికీ ఉద్భవిస్తూనే ఉన్నారనడానికి నిలువెత్తు నిదర్శనమే 'అమ్మమ్మ'.

అమ్మమ్మగారికి 'పూలమ్మ'గారని ఒక వాడుక పేరు ఉండేది. ఆమె దోసిలి పడితే, ఎక్కడనుంచి వచ్చేవో గాని ఆ దోసిలి నిండుగా గులాబీలు మొదలైన పూలు వచ్చేసేవి. ఒక్కొక్కసారి వాటిని తన చుట్టూ వెదజల్లేవారు. ఒక్కొక్కసారి పక్కనున్నవారికి ఇచ్చేవారు. అలాగే గాలి నుంచి కలకండ తీసి తినమని పక్కనున్న వారికి ఇచ్చేవారు. ఈ అద్భుతాలను కళ్ళారా చూచినవారు ఈనాటికీ గుంటూరులో ఎంతోమంది జీవించి ఉన్నారు.

అద్భుతాలనేవి ఆధ్యాత్మిక ఔన్నత్యానికి కొలబద్దలు కావు. కానీ సామాన్య జనం వాటిని చూచి ముగ్ధులౌతూ ఉంటారు. అద్భుతాలు చేసేవారిని మహనీయులని లోకం సామాన్యంగా భావిస్తూ ఉంటుంది. అమ్మమ్మ యొక్క ఆధ్యాత్మిక ఔన్నత్యం ఆమె చేసిన అద్భుతాలలో లేదని నా ఉద్దేశ్యం. నిరంతరం సాయిబాబాను స్మరిస్తూ, సంపూర్ణ శరణాగతితో, ఏ పటాటోపమూ ఆర్భాటమూ లేకుండా, ఒక సాధారణ గృహిణిగా పరమసాత్వికమైన జీవితాన్ని గడుపుతూ, తన సద్గుణాలను, తన కుటుంబంలోని అందరికీ, ముఖ్యంగా చిన్నపిల్లలకు కూడా ఉగ్గుపాలతో నేర్పించి, వారి ఆధ్యాత్మిక జీవితానికి బాటలు వేసిన ఆమె యొక్క వ్యక్తిత్వంలోనే అసలైన దివ్యత్వం ఉన్నదని నా నమ్మకం.

అద్భుతాలతో, మహత్యాలతో నిండిన పుస్తకాలు పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఈ రోజులలో – మనిషి జీవితం కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే ఉద్దేశించినది కాదని, దైవానుభూతిని పొంది జన్మసాఫల్యతను సాధించడమే దాని పరమావధి యనీ, ఆ దిశగా మనిషి యొక్క ప్రయత్నం సాగాలనీ చెబుతూ సాగిన ఈ రచన మన సనాతన ధర్మపు మూలస్తంభాలైన వేదోపనిషత్తుల భావాలకు అనుగుణంగా ఉన్నది.

రచయిత సాయికిరణ్ మామగారైన శ్రీ వడ్లమూడి వెంకటేశ్వరరావుగారు తనకు దీక్షా గురువు. ఆయన శ్రీ కళ్యాణానంద భారతీ స్వామివారి ప్రియశిష్యులు మాత్రమేగాక 'శ్రీచక్రదర్శనమ్', 'శ్రీలలితానామార్థమంజూష', 'యంత్రనియతి' వంటి ఎన్నో మహత్తరములైన గ్రంథములను రచించిన నవీన కాలపు మంత్రద్రష్ట, ఋషితుల్యులు.

అమ్మమ్మ శిక్షణలో ఆధ్యాత్మిక పునాదులను వేసుకున్న సాయికిరణ్, మామగారి రక్షణలో ఆధ్యాత్మిక సాధనలో ఉత్తీర్ణుడౌతూ ఉన్నతములైన శిఖరాలను అందుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అటువంటి ఉత్తముని కలం నుండి ఇటువంటి ఉత్తమమైన పుస్తకం రాకపోతే ఇంకేమి రాగలదు?

ఈ ముందుమాట వ్రాసే వరాన్ని నాకిచ్చిన అమ్మమ్మకు ప్రణమిల్లుతూ, సాయికిరణ్ ముందు ముందు ఇంకా ఎన్నో మంచి ఆధ్యాత్మికపరములైన గ్రంథాలను వ్రాసి వారి గురువులకు, మనకు, అందరికీ ఆనందాన్ని కలిగించాలని ఆశిస్తూ అతన్ని ఆశీర్వదిస్తున్నాను.

**– సత్యనారాయణ శర్మ**

గుంటూరు

21–ఆగస్టు–2016



# అమ్మమ్మకు నమస్సులతో...

**అ**మ్మమ్మకు నమస్సులతో...

ప్రతి వ్యక్తి తన జీవితంలో అమ్మ అనే పదాన్ని ఎన్నిసార్లు అంటాడో, అనుకుంటాడో, వింటాడో, చదువుతాడో తెలియదు కానీ, నా వరకు దాదాపు ప్రతిసారి అమ్మతోపాటు స్ఫురించేది అమ్మమ్మ. అర్థం చేసుకోలేని ఆ ప్రత్యేకత అమ్మమ్మ దగ్గర ఏముందో! అందరు అమ్మమ్మలు అలానే ఉంటారా లేక మా అమ్మమ్మే అలా ప్రత్యేకమా?

ఎన్నో శిశిరాలని దాటుకుంటూ వచ్చిన వసంతంలా, మరెన్నో చీకట్లు చీల్చుకుంటూ, వెలుగులు వెదజల్లుతున్న విహంగంలా, కల్మషం లేని అమ్మమ్మ చిరునవ్వు ఓ నమ్మకాన్ని ఎప్పుడూ వెలిగించేది. అమ్మమ్మ లేదనుకుంటేనే, ఆనందంగా మొదలైన బాల్యం అకస్మాత్తుగా ఆవిరయ్యిందని అనిపిస్తుంది.

ఏమీ తెలియని పసితనపు వయసులోనే అమ్మమ్మతో పదేళ్ళ సాహచర్యం, మా అందరికీ అడగకుండానే దేవుడిచ్చిన వరం కదా అది! దాదాపు మూడు సంవత్సరాలు, నన్ను, రమక్కను చేయి పట్టుకొని గుంటూరు బ్రాడీపేటలోని బాలానంద కేంద్రం తీసుకువెళ్ళేది అమ్మమ్మ. దురదృష్టం ఏమిటంటే, మనోవికాసపు తొలిదశ కూడా ప్రారంభం కాని వయసు అది.

ఆ వయసుకు అమ్మమ్మంటే చాక్లెట్లు, బిస్కెట్లు, కొత్తబట్టలు కొనిచ్చే మంచి అమ్మమ్మ మాత్రమే. నందూరు వెళ్ళినప్పుడల్లా పెద్ద ఇత్తడి గ్లాసులో మీగడపాలు పోసిచ్చే అమ్మమ్మే. పెద్దవాళ్ళౌతున్నారు నందూరులో బోరుగా ఉందేమో, పొన్నూరెళ్ళి సినిమా చూసి రండని డబ్బులిచ్చే అమ్మమ్మే! తిరిగి బయలుదేరినప్పుడు దాచుకోండని చేతిలో డబ్బులు పెట్టే అమ్మమ్మే!! మాటలు తెలియని, సరిపోని ఆ పసితనంలో అమ్మమ్మను ఏమడగాలో తెలియరాలేదు. ఇప్పుడు ఎలా అడగాలో తెలియటం లేదు.

దేనికోసమో మనం ఇక్కడికి వచ్చామని ఎవరో చెబుతుంటారు. మంచిగా మిగిలిపో అని అందరూ అంటుంటారు. నిన్ను నీలో వెతుక్కోమని మరో గొంతు చెబుతుంటుంది, మనిషిగా మనకు కావలసింది ఏమిటో మనకే అర్థం కాదు. ఎవరిని అడుగుదామనుకున్నా, అందరిదీ అర్థంకాని అదే పరిస్థితి. సరిగ్గా ఇప్పుడున్న ఇటువంటి పరిస్థితుల్లో గుర్తుకొచ్చేది కూడా అమ్మమ్మే! కళ్ళు చెమ్మగిల్లుతాయి. కంఠం రుద్ధమౌతుంది. మాట పెగలదు. మనసు మౌనం వీడదు. ఇంకా అడిగేదేముంటుంది అనిపిస్తుంది! మరో ఉషస్సు కోసం మేలుకొలుపు పాడమని, ఆ పలుకులు వినాలని, ఆ పాటలో పరవశించాలని, అడగకుండానే ఆశీర్వదించిన ఆ చేతులని మరోసారి తాకాలని, పాదస్పర్శతో పునీతమవ్వాలని, మరొక్కసారి చూడాలని, క్షణకాలం మాట్లాడాలని... అమ్మమ్మతో నాకు కలిగిన కొన్ని దివ్యానుభవాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ.. వాటి నిజమైన సారాన్ని విశ్లేషించుకుంటూ... మరోసారి ప్రేరణ పొందుతూ... నాలోని నేను నాకుగా నేను తెలుసుకోవాలని చేస్తున్న ప్రయత్నాన్ని ఆశీర్వదించమని అమ్మమ్మను వేడుకుంటూ... నమస్సులతో...

**– కిష్టిగాడు.**

# సాయిబాబా చేసిన అద్భుతాలు

**జ**పతపాలు, హోమాలు, పారాయణలు, సత్సంగాలు –ఎన్ని చేసినా, పుస్తకాలు ఎన్ని చదివినా అంతర్గతమైన మార్పులు రానంతవరకూ, ఆలోచనా విధానం మారనంతవరకూ అవన్నీ వ్యర్థమే. అవి రావాలంటే సాధనలో నిజాయితీ అవసరం. అదనంగా ఓ పది నిముషాలు దైవసన్నిధిలో కూర్చోటానికి కూడా తీరికలేనన్ని పనులుంటాయి. అదే, అనుకోకుండా స్నేహితులతో సినిమాలకి, పార్టీలకు ఎటువంటి అడ్డంకులు కనిపించవు. దైవసన్నిధిలో కూర్చునే ఆ పదినిముషాలైనా దైవభీతితో మాత్రమే కానీ, దేవుడి మీద కృతజ్ఞతాభావంతో మాత్రం కాదు. అది కూడా, ఒక అగరుబత్తీ వెలిగించి పటికబెల్లం ముక్క పెట్టకపోతే, మన కోరికలు తీర్చడేమో అన్న భయంతోనే. ఇక్కడా వ్యాపారమే! లౌకికమైన వ్యాపకాల కోసం తపన పడినకొద్దీ, అవి మరింత తపింపచేస్తాయని గ్రహించలేకపోవటం దురదృష్టం.

ఈ రోజుల్లో భక్తి పూర్తిగా వ్యాపారమయమయ్యిందని బాధపడతాం. గుళ్ళ పేరుతో స్థలాలు కబ్జా చేస్తున్నారని ఆవేశపడతాం. నిజానికి, మన అంతఃకరణలోకి మనం తొంగిచూసుకుంటే, భక్తి పేరుతో మనం చేస్తున్నది కూడా స్వార్థపూరితమైన వ్యాపారమేనని గ్రహించగలుగుతాం. కానీ, ఒక్కసారి కూడా అంతరంగంలోకి తొంగిచూసే ధైర్యం చేయలేకపోతున్నాం! అంతఃసంఘర్షణ లేకుండా ఔన్నత్యం రాదని తెలుసు. కానీ అదే జరిగితే నకిలీ బోలు రూపాలుగా మిగిలిన మన నగ్న స్వరూపాలు మనం చూడలేమని తెలుసు. అలా ఊహించుకోలేక ఆ సంఘర్షణకి అవకాశం కూడా ఇవ్వలేకపోతున్నాం!

అబ్బాయికి ఇంజనీరింగ్ సీటు వస్తే గుండు గీయించుకుంటామని మొక్కుకుంటాం. నిజానికి దీనికి ఒక సంకేతపరమైన పరమార్థం ఉంది. తలనీలాలు సమర్పించటం అంటే, తలకెక్కిన అహంకారాన్ని తృణప్రాయంగా వదిలించుకుంటున్నట్లు భావించాలి. మనం అలా భావిస్తున్నామా? ఇవాళ ఇంజనీరింగ్ సీటుకోసం, రేపు అమ్మాయి పెళ్ళికోసం, ఆ మర్నాడు మరో కోరిక కోసం. పెద్దాయన మన కోరికలు తీరుస్తూపోతే, మనకు పోయేదేముంది జుట్టు తప్ప! అది ఆయనకేం ఉపయోగం?

అమ్మమ్మైనా, సాయిబాబా అయినా, మరే దేవుడైనా సరే, మన జీవితంలో మనకు జరిగిందనుకుంటున్న మంచిమీద వాళ్ళ గొప్పదనం ఆధారపడి ఉండదు. లౌకికంగా మనకు వాళ్ళు తీర్చే కోరికలమీద వారి గొప్పదనాన్ని అంచనా వేయటం చాలా పెద్దతప్పు. ఆత్మోన్నతి కోసం నిజంగా నిజాయితీగా ప్రార్థిస్తే, మన ప్రయత్నాలకి తోడుగా మన వెంటే ఉండి నడిపిస్తారు అని గ్రహించాలి.

అనుకోకుండా ఇంటర్నెట్‌లో తారసపడ్డ ఆప్తులు, నిజమైన ఆత్మబంధువు, సాధనామార్గంలో తన బ్లాగుద్వారా, ఎన్నో చర్చల ద్వారా, ఎన్నెన్నో విశ్లేషణల ద్వారా, తాంత్రికపరమైన మరెన్నో రహస్యాలు పంచుకునే శ్రేయోభిలాషి శ్రీ సత్యనారాయణ శర్మగారు గుంటూరు నివాసి. కొన్నేళ్ళ క్రితం పరిచయం అయిన ఆయన్ని ఎందుకో అన్నగారు అని పిలవటం జరిగింది. అంతే ఆప్యాయంగా ఆయన కూడా తమ్ముడుగా నన్ను ఆమోదించారు. ఈ సందర్భంలో ఆయన 'ఆలోచనా తరంగాలు' బ్లాగులో వ్రాసిన, మనకు ఎంతగానో ఉపకరించే కొన్ని వాక్యాలు :

*"సాయిబాబాను నేను నమ్ముతానో లేదో ప్రస్తుతానికి పక్కన ఉంచుదాం. సాయిబాబా చేసిన అద్భుతాలలో అతిగొప్ప అద్భుతం ఏమిటో మీరు చెబితే మీరు సాయిబాబాకు మంచిభక్తులని ప్రస్తుతానికి మిమ్మల్ని నమ్ముతాను.*

*ఈ ప్రశ్నను నేను 30 ఏళ్ళ నుంచీ అడుగుతున్నాను. ఇంతవరకూ ఒక్కరంటే ఒక్కరు కూడా నాకు సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోయారు. నా ప్రశ్నకు సమాధానంగా బాబా జీవితం నుంచి ఎవరికి తోచిన మహిమలను వారు పుంఖానుపుంఖాలుగా ఉటంకించేవారు.*

*ఇది నిజమైన భక్తి కాదు. దీన్ని వ్యాపారభక్తి అంటారు. ఆయనవల్ల మాకు లాభం కలుగుతున్నది గనుక డప్పు వాయిస్తాం అనేదే వీరి లాజిక్. సాయిబాబా ఎన్నో అద్భుతాలు చేసారు. కానీ ఆయన చేసిన అసలైన అద్భుతం ఏమంటే – శ్రీ ఉపాసనీ మహరాజ్ అనబడే వజ్రాన్ని సృష్టించడం.*

*ఎంతసేపూ లాభం అనే కోణంనుంచి మాత్రమే ఆలోచిస్తూ, నిన్ను నమ్మితే నాకేంటి అని మాట్లాడే స్వార్థపరులకు ఇది అర్థంకాని అద్భుతం. ఈ ఉపాసనీ మహరాజ్ వల్లనే, మేర్వాన్ (శ్రీఅవతార్ మెహర్‌బాబా) తనను బంధించిన ఆధ్యాత్మిక త్రిశంకుస్వర్గం నుంచి క్రిందకు రాగలిగాడు. పరిపూర్ణత్వాన్ని సంతరించుకోగలిగాడు. కనుక ఉపాసనీ మహరాజ్ ద్వారా పరోక్షంగా మేర్వాన్‌కు సహాయపడింది సాయిబాబానే.*

*వస్తువులను సృష్టించడం, రోగాలు నయం చేయడం, భూతాలను వదిలించడం, కేసుల్లో గెలిపించడం – ఇవి అసలైన అద్భుతాలు కావు. ఒక మనిషిని జన్మ పరంపరల నుంచి దాటించి దైవానుభూతిని కలిగించడమే అసలైన అద్భుతం. దైవమార్గంలో అయోమయంలో ఉండి కొట్టుకుంటున్న ఓ మంచి సాధకునికి దారి చూపించి ముందుకు నడిపించి దైవసన్నిధికి అతన్ని చేర్చడమే నిజమైన అద్భుతం. సాయిబాబా చేసిన నిజమైన అద్భుతం ఇదే.*

నిజమే, బాబాను కోరికలు తీర్చే కల్పతరవుగా కాకుండా, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రసాదించే ఓ సద్గురువుగా ఎందరు భావిస్తున్నారు? ఒక మనవడిగా కాకుండా, ఒక మామూలు సాధకుడిగా నా అభిప్రాయంలో అమ్మమ్మ కూడా సాయిబాబా సృష్టించిన ఒక అద్భుతమే!

# ఆ మరో అద్భుతమే అమ్మమ్మ

**కొం**డలు, గుట్టలు, చెట్లు, చేమలు, నదులు, సముద్రాలు, జంతువులు, పక్షులు... ఇంకా మానవులు! ఈ పుడమి మీద భగవంతుని సృష్టి ఎంత అద్భుతంగా ఉంటుందో, అంత విస్మయాన్ని కూడా కలిగిస్తుంది. ఒక్క మానవుడు తప్ప, తక్కినవన్నీ మానవుడికి ఉపయోగపడేవే! చేతనాచేతనలన్నిటి మీదా తన అధికారం చలాయించగలుగుతున్న మానవుడు తనను తాను జయించటం సంగతి తరువాత, కనీసం తెలుసుకోలేకపోవటం ఆశ్చర్యమే!

అయినా, ఎంత ఆధునిక కాలమైనా, ఈ దేశంలోనే భక్తివైరాగ్యాల మీద ధ్యాస వదలని ప్రజలు మనకి ఇప్పటికీ తారసపడుతూ ఉంటారు. నేనెవరు? నా మూలాలేమిటి? నేనెందుకు పుట్టాను? నేను ఎందుకు మరణిస్తాను? జననమరణ చక్రం నుండి బయటపడటమే జీవితానికి సార్థకతా? అదెలా సాధ్యం? తనకు తాను ఇలాంటి ప్రశ్నలు వేసుకొని, సమాధానాల కోసం తపించే ప్రజలు ఇప్పటికీ ఈ దేశంలో పుడుతూనే ఉన్నారు. దానికి కారణం, ఎంతో అద్భుతమైన యోగసంపన్నమైన మన భారతదేశమే.

ఎందరో మహాయోగుల, మహర్షుల, తపఃశ్శక్తి సంపన్నుల ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే, ఈ రోజుకి కూడా ఆధ్యాత్మిక తరంగాలు ఇక్కడి ప్రజలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. అటు హిమవత్పర్వతాల నుంచి ఇటు అరుణాచలం వరకు... అటు ద్వారకలోని కృష్ణధామం నుంచి ఇటు పూరీ జగన్నాధనాధుడి వరకు... అటు ద్వాదశ జ్యోతిర్లింగాల నుంచి ఇటు అష్టాదశ శక్తిపీఠాల వరకు...

ఈ దేశంలోని అణువణువు అటువంటి మహనీయుల పాదస్పర్శతో పునీతమయ్యింది.

సాక్షాత్తూ ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్రుడు సీతాసమేతంగా నడిచిన నేల ఇది. సాక్షాత్తూ భగవత్స్వరూపుడై అర్జునుడికి గీతబోధ గావించిన శ్రీకృష్ణుడు నడయాడిన నేల ఇది. వాల్మీకి, వ్యాస, వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య మహర్షుల నుండి శ్రీ శంకరభగవత్పాదులు, శ్రీ విద్యారణ్యస్వామి, నిన్న మొన్నటి శ్రీ కంచి పరమాచార్యుల వంటి మహనీయుల, బ్రహ్మజ్ఞానుల పాదస్పర్శతో ఆసేతు హిమాచల పర్యంతము పునీతమైన దేశం ఈ భారతదేశం. ఒక రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, షిర్డీ సాయిబాబా, నానక్, రమణమహర్షి... చెప్పుకుంటూ పోతే గంటల తరబడి అటువంటి మహాయోగీశ్వరుల పేర్లు చెప్పుకుంటూ పోవచ్చు. ఇటువంటి సంకల్పసిద్ధులైన మహర్షుల కారణంగానే భారతదేశం కర్మభూమి అయ్యింది.

నారద భక్తిసూత్రాలలో దేవర్షి ఇలా చెబుతారు:

'మహత్సంగస్తు దుర్లభోఽ గమ్యోఽ మోఘశ్చ' (39). మహాత్ముల సాంగత్యము దుర్లభము, అగమ్యము, అమోఘము. అలా అంటూనే, 'లభ్యతేఽ పి తత్కృపయైవ' (40) భగవత్కృప వలన మాత్రమే వారి సాంగత్యం లభిస్తుంది అని కూడా చెప్పారు దేవర్షి. ఇంకా 'తదేవ సాధ్యతాం తదేవ సాధ్యతామ్' (42) అంటే – ఆ మహాత్ముల సాంగత్యము కొరకే సాధన చేయుము, దానినే సాధించుము అని కూడా నారదమహర్షి చెబుతారు.

అటువంటిది, ఎన్ని జన్మల సంస్కారం, మరెంత దైవకృప ఉంటే, ఒక మహాయోగిని కుటుంబంలో జన్మించగలం, ఆ అమ్మకు సన్నిహితంగా మెలగగలం! అమ్మలగన్న అమ్మని మరిపించే అమృతతుల్యమైన అమ్మమ్మ చేతిముద్దలు తినగలం, బాధలు చెప్పుకోగలం, ఆశీస్సులు అందుకోగలం .... ఇవన్నీ అయాచితంగా అందివచ్చిన అదృష్టంగా భావించటంలో తప్పులేదేమో!

దాదాపు నా చిన్నతనంలోని వేసవి సెలవులన్నీ అమ్మమ్మ సాన్నిధ్యంలోనే గడిచాయి. ప్రపంచాన్నే మరపించే పారవశ్యమేదో అమ్మమ్మ ఉన్న పరిసరాల్లో లభించేది. అది గుంటూరైనా, నండూరైనా, పొన్నూరైనా సరే, ఆ మాటకొస్తే, ఎక్కడైనా సరే.

కాషాయం కట్టిన సన్యాసి జీవితం కాకపోవచ్చు కానీ, దేహభ్రాంతిని వదిలేసిన తీవ్రవైరాగ్యం అమ్మమ్మది. మోహాలని, వ్యామోహాలని వదిలి దైవసాన్నిధ్యంలో పరిపూర్ణ శరణాగతిని ఆచరించి చూపిన జీవితం అమ్మమ్మది. మొరెత్తి మొరపెట్టుకున్న ప్రతివాళ్ళకి సహాయం కాదనకుండా చేసింది. మాట వరసకు చేసిన సాయమైనా, మనిషిలో ఆసాంతం మార్పులు తీసుకువచ్చే సాయం చేసేది. ఎంతటి కఠోరసాధనతో ఎంత గొప్ప తపస్సు చేసిందో!

వివేకచూడామణిలో శ్రీశంకరాచార్యులవారు చెబుతారు:

యోగస్య ప్రథమం ద్వారం వాగ్నిరోధో అపరిగ్రహః।
నిరాశాచ నిరీహాచ నిత్యమేకాంత శీలతా॥

మితంగా మాట్లాడటం, ఇతరుల నుంచి ఏదీ ఆశించక పోవటం, గ్రహించక పోవటం, కోరికలు, కీర్తికండూతీ లేకపోవటం, ఏకాంతాన్ని అభిలషించటం ఇవి యోగులకు యోగాన్ని అభ్యసించేవారికి కావలసిన లక్షణాలు. ఈ శ్లోకంలోని ప్రతి అక్షరం అమ్మమ్మకు అన్వయించుకోవచ్చు. అంతేకాదు, పదిమందిలో ఉండాల్సి వచ్చినా తన ఏకాగ్రచిత్తాన్ని, ఏకాంతతని అమ్మమ్మ కోల్పోయినట్లు ఏనాడూ కనిపించలేదు. నిజమైన యోగులే ఆ విధంగా ఉండగలరు.

అమ్మమ్మకు మనవడిగా పుట్టటం నాదెంత అదృష్టమో! మిగతా మనవళ్ళు, మనవరాళ్ళు మరెంత అదృష్టవంతులో!! ఆమె కడుపున పుట్టిన పిల్లలు ఇంకెంత అదృష్టవంతులో!! ఆ అమ్మ నడిచిన నందూరు, నందూరు నివాసులది ఎంతెంత అదృష్టమో!! ఎవరి అదృష్టం వారిది. ఎవరి అర్హత వారిది. ఆయా అర్హతల అనుగుణంగా అమ్మమ్మ దగ్గర ఎవరెవరికి ఏమేమి కావాలో అవన్నీ లభించాయి. నా అర్హత కనుగుణంగా అమ్మమ్మ ద్వారా నాకు లభించిన అమూల్యమైన ఆధ్యాత్మికానుభూతులు కొన్ని అందరితో పంచుకోవటం నాకు అమితానందాన్ని కలిగిస్తున్నది.

✲

# ముందు నండూరు

**నం**డూరు... ఆ మాట వింటేనే ఒళ్ళు పులకరిస్తుంది. శీతాకాలపు ఉదయాన సుతారంగా తాకే లేత సూర్యకిరణంలా ఆప్యాయంగా తాకే అమ్మమ్మ చూపులు గుర్తుకువస్తాయి. ఆ వెంటనే విచ్చుకున్న వెన్నెలలా బోసినవ్వులతో ఎలా ఉన్నావురా అనే అమ్మమ్మ పలకరింపులు వినిపిస్తాయి!

సాధారణంగా వేసవి సెలవుల్లోను, మే ఉత్సవాలకు, తాతగారి తద్దినానికి వెళ్ళేవాళ్ళం రమ, ఉమ, వాణీ, నేను. గుంటూరు నుంచి ముందు పొన్నూరులో చిన్నామ్మ, పెద్దామ్మా, మా బామ్మవాళ్ళింటికి, అక్కడ నుంచి రాముడు, హనుమాన్, బుడ్డిలతో నండూరు చేరుకునేవాళ్ళం. బాబు, రఘు, భారతీ కూడా విజయవాడ నుండి వచ్చేవారు.. పొన్నూరు నుండి ఇటుకంపాడు, బోడిపాలెం లేదా కాకుమాను బస్సులన్నీ నండూరు మీదుగా వెళ్ళేవి. ఒక్కసారి మాత్రం మేము సైకిళ్ళమీద నండూరు వెళ్ళొచ్చాం.

ముందుగా నండూరు మెయిన్ రోడ్డుమీదే ఉన్న మసీదు సెంటర్లో ఒక స్టాపు. ఇక్కడే ఓ చెరువు కూడా ఉండేది. ఆ వెంటనే బాబా సెంటర్లో మరో స్టాపు. ఆ తర్వాత ఆంజనేయస్వామి సెంటర్లో మరో స్టాపు. ఇక్కడే ఒక గ్రంథాలయం ఉండేది. ఆంజనేయస్వామి గుడికి కొద్దిదూరంలో పోలేరమ్మ గుడి. అలానే, బాబా మందిరం ఉన్న రోడ్డులోనే కొద్దిదూరం లోపలికి వెళ్తే పాత శివాలయం కనిపిస్తుంది.

నండూరు అనగానే అమ్మమ్మ, సాయిబాబాతో పాటు గుర్తుకొచ్చే చాలా విషయాలున్నాయి. అమ్మమ్మ ఉన్న మూడు గదుల ఇల్లు. ఒకటి వంటిల్లు, రెండోది

భోషాణం గదిగా మేము పిలిచే మధ్య గది, మూడోది స్టోర్‌రూములా వాడే గది. మూడు గదులు ఒకదాని వెంబడి మరోటి రైలుపెట్టెల్లా ఉండేవి. వంటగది, స్టోరుగదులలో బండలు ఉండేవి కానీ, మధ్య గది మాత్రం చాలాకాలం ఆవుపేడతో అలకబడి ఉండేది. ఇంటికి ఒకవైపు రోడ్డు, మరోవైపు మందిరం. మందిరం వైపు ఇంటికి ఆ చివరినుంచి ఈ చివరిదాకా గట్టు. అక్కడే పిల్లలమంతా కూర్చొని కబుర్లు, కథలు చెప్పుకునేవాళ్ళం. ఇంటి నుంచి ఓ 15-20 అడుగుల దూరంలో మందిరం.

మందిరానికి బయటివైపు ఉన్న పెద్ద రావిచెట్టు, చెట్టుకు వెనుకవైపు లోపలగా నందివర్ధనం పూలమొక్కలు, మందిరానికి వెనుకవైపు మందారం చెట్లు, కనకాంబరం పూలమొక్కలు. వాటికి వెనుకగా రెండు టాయ్‌లెట్లు. అలానే ఇంటికి చివరగా ఉన్న వంటగది పక్కన స్నానాలగది. మూడు పెద్దపెద్ద గాబులు (తొట్లు). నీళ్ళు వదలగానే ట్యూబులతో గాబులు పట్టేవాళ్ళం. అలాగే, స్నానం చేసి పూలుకోసి పంతులుగారికో (జంధ్యాల సీతారామయ్యగారు), పూజారి ప్రసాద్‌గారికో ఇచ్చేవాళ్ళం.

మందిరంలో ముందు హాలు, గర్భగుడి. మందిరం అంతా మొజాయిక్ ఫ్లోరింగ్ ఉండేది. ప్రదక్షిణ చేయటానికి గర్భగుడి బయటివైపు చుట్టూ ఖాళీగా ఉండేది. గర్భగుడికి ఆనుకుని ఒక పక్క వినాయకుడి విగ్రహం, మరోవైపు హుండి. హుండీకి పైన తాతగారు, అమ్మమ్మ ఫొటో ఒకటి ఉండేది. హాలుకు ఇటువైపు (నందివర్ధనం పూలమొక్కలు కనిపించే కిటికీవైపు) పెద్ద చెక్క ఉయ్యాల. ఉయ్యాల పక్కనే అద్దం, విభూతి ఉండ, కుంకుమ. ఉయ్యాలకు మరోవైపు గర్భగుడికి పక్కగా రెండు బీరువాలు, బాబా పల్లకి ఉండేవి. ఇటువైపు చివర హెచ్.ఎం.వి. సెట్టు రికార్డు ప్లేయరు ఉండేది. హాలు గోడలనిండా ఈ మందిర పోషకుల, రాజపోషకుల, మహారాజ పోషకుల, శాశ్వత మహారాజ పోషకుల పేర్లు వ్రాయబడి ఉండేవి. ఆ పేర్లతో ఆటలు కూడా ఆడుకునేవాళ్ళం. దాదాపు పేర్లన్నీ కంఠతా వచ్చినవే. హాలుకు గ్రిల్ తలుపులు. తలుపుల బయట ఒకదాని మీద మరొకటి పేర్చినట్లు అర్ధచంద్రాకారంలో కనిపించే మెట్లు. మెట్లకు చెరోవైపు కూర్చోటానికి జాగా. ఈ మెట్లపైన ఎప్పుడు చూసినా మొక్కజొన్న కండెలు పిచ్చుకల కోసం వ్రేలాడగట్టేవాళ్ళు.

ఇంటి మెయిన్ గేటువైపు ఎదురుగా సరోజనమ్మ హోటల్. హోటలంటే హోటల్ కాదు. ఓ పాకలో హోటల్లాగా నడుపుకునేది సరోజనమ్మ. పక్కనే పేడతో అలికిన గట్టుమీద కూర్చొని తినాల్సి వచ్చేది. ఇడ్లీ చెట్నీ బాగుండేది. మగపిల్లలం మాకు నందూరు మెయిన్ రోడ్డుమీద ఉన్న మరో హోటల్ బాగా నచ్చేది. ఎందుకంటే, ఇక్కడ కూర్చొని తినటానికి కుర్చీలు బల్లలు ఉండేవి. పిల్లలమంతా ఉంటే మా గోల మా గోలగానే ఉండేది. పాలు తాగి, టిఫిన్ తిని ఊరిమీద పడేవాళ్ళం. రాముడన్న చెప్పే దయ్యాల కథలు భయపడుతూనే వింటూ నడుచుకుంటూ వెళ్ళేవాళ్ళం. మళ్ళీ భోజనం టైముకు రావటం, తినటం, కబుర్లు చెప్పుకోవటం అలా గడిచేది. ఎవరి పిల్లలు బాబు అని ఎవరైనా అడిగిందే తడవుగా అమ్మగారి మనవళ్ళం అని గొప్పగా చెప్పుకునేవాళ్ళం. అమ్మమ్మకు లేని డాబు దర్పమంతా మేమే చూపించేవాళ్ళం.

ఈ పరిసరాలతో పాటు గుర్తుకొచ్చే వ్యక్తులు కూడా కొందరు ఉన్నారు. వాళ్ళల్లో మొట్టమొదటగా చెప్పుకోవాల్సింది నందూరు మాస్టరుగారు. ఆయన అసలు పేరు జంధ్యాల సీతారామయ్యగారు. మొదట్లో, నందూరులోని ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలో టీచరుగా చేసేవారు. ఆ తర్వాత బదిలీమీద ముట్లూరు వెళ్ళినట్లుగా గుర్తు. అంతేకాకుండా, నందూరులో మొట్టమొదటగా మాతో పూజలు చేయించిన పంతులుగారు కూడా ఈయనే. మందిరానికి సంబంధించిన ప్రతి వ్యవహారంలో చేదోడువాదోడుగా ఉండేవారు. ముఖ్యంగా బాబా ఉత్సవాల సమయంలో ఆయన చేసే హడావుడి బలే తమాషాగా ఉండేది.

ఇంకా అలా గుర్తుకొచ్చే వ్యక్తులు యనమండ్ర ప్రసాదుగారు (పూజారి గారు), ప్రసాదుగారు (మరో పూజారిగారు) వెంకటలక్ష్మమ్మగారు, సుబ్బాయమ్మ, తిరుపతమ్మ. వెంకట లక్ష్మమ్మగారు అమ్మమ్మకు వండిపెట్టేవాళ్ళు. సుబ్బాయమ్మ ఇంటిపనులు చేసిపెట్టేది. తిరుపతమ్మ బట్టలు ఉతకటం, ఆరేయటం లాంటివి చేసిపెట్టేది.

అలానే, పద్మావతమ్మ అత్తయ్య (కరణం సుబ్బారావుగారి భార్య). ఇంటిలోని దాదాపు ప్రతి కార్యక్రమంలోను పద్మావతమ్మగారు చేదోడువాదోడుగా నిలిచేవారు. తాతగారు పోయిన సమయంలో ఒంటరిగా మిగిలిన అమ్మమ్మకు అన్నీ తానై తోడు నిలిచి ఆసరా అందించిన మంచిమనిషి. అమ్మమ్మనే కాకుండా మా


నండూరు గ్రామస్తులు

అమ్మ (కొండముది నిర్మలగారికి), మా పిన్ని లక్ష్మక్కయ్యలను తన పిల్లలతో (జయలక్ష్మి, సావిత్రి, నిర్మల) సమానంగా ఆదరించేవారు. ఇంకా తులశమ్మగారు, విశాలాక్షిగారు, చంద్రమౌళిగారు, భట్రాజుల అన్నపూర్ణమ్మగారు, నారాయణరావు గారు, పప్పు వెంకటేశ్వర్లుగారు, డాక్టర్ రమాపతిగారు, బాబా వ్రతం పుస్తకంలో పాటలు వ్రాసిన సుబ్బారావుగారు, బుడ్డి వెంకటేశ్వర్లుగారు, దశరథరామయ్యగారు, కృష్ణమూర్తిగారు.

నందూరులో ఆధ్యాత్మిక తరంగాలు పిల్లలమీద కూడా ఎంత ప్రభావాన్ని చూపిస్తాయో! ఒకసారి సాయిబాబా సప్తసప్తాహం మొదలుపెట్టారు. అంటే, నలభై తొమ్మిది రోజుల పాటు రాత్రి పగలు అని లేకుండా నిర్విరామంగా బాబా భజనలు చేస్తారన్నమాట. చివరి నాలుగైదు రోజులనుకుంటాను మేమంతా నందూరు చేరాము. రోజల్లా భజనలో లీడ్ తీసుకోటానికి పిల్లలమైన మాకు అవకాశమే రావట్లేదు. దానికితోడు పిల్లలం అని మాకు భజనచేసే చెక్కలు కూడా దొరికేవి కావు.

మాములు రోజుల్లో, ప్రతి గురువారం సాయంత్రం భజన చేసేప్పుడు మాకు భజన చేసుకోడానికి అన్ని పరికరాలు తేలికగానే దొరికేవి. ఇప్పుడు ప్రత్యేక కార్యక్రమం కావటంతో భజన చేసేవాళ్ళు ఎక్కువై పోయారు. కానీ, ఒక రోజు తెల్లవారుజామున ఒకటి కోసం లేచినప్పుడు, ఒక్క నారాయణరావుగారే భజన చేస్తూ కనిపించారు. ఇంకేం, వెంటనే లేచి కాళ్ళు చేతులు మొహం కడుక్కొని ఆయన ఎదురుగ్గా కూర్చుని భజన చేయటం మొదలుపెట్టాను.

కాసేపటికి బాబు అనుకుంటా తను కూడా లేచి వచ్చాడు. ఆ వెనకే ఉమ, వాణీలు కూడా వచ్చినట్లు గుర్తు. ఇక ధైర్యం వచ్చేసింది భజన చెక్కలు చేతుల్లోకి తీసుకొని వీరావేశంగా భజన మొదలుపెట్టాం. పాపం, రాత్రంతా నిద్ర కూడా లేకుండా, భజన చేసీచేసీ అలసిపోయి కనిపించారు నారాయణరావుగారు. లీడు తీసుకొని ఆయన నీరసంగా చేస్తుంటే, పక్కనుంచి పిల్లలం వీరావేశంగా చేయటం, కొద్దిగా విచిత్రంగా అనిపించింది. ఆయన స్థానంలోకి రావలసినవాళ్ళు ఇంకా రాలేదు. ఆయన ఏం చేయాలో తోచక ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తూనే ఉంది.

సరేలెమ్మని, మరింత ధైర్యంచేసి మేం చేస్తాంలేండి, మీరు విశ్రాంతి తీసుకోమని చెప్పీ చెప్పకుండా లీడ్ తీసేసుకున్నాం. దాదాపు ఓ గంటపాటు వీరవిజృంభణతో మా కార్యక్రమం కొనసాగింది. ఆ తర్వాత పెద్దవాళ్ళు రావటం, మేము పక్కకి తప్పుకోవటం కూడా జరిగింది. కానీ, ఇదే ఐడియాతో మిగిలిన మూడు రోజులు పొద్దుటి కార్యక్రమాన్ని మా చేతుల్లోకి తీసేసుకున్నాం.

అలానే అన్నదానం అప్పుడు వడ్డించటం. మొదట్లో చిన్నపిల్లలం అని మమ్మల్ని రానిచ్చేవాళ్ళు కాదు. కొద్దిగా పెద్దైన తర్వాత, పూలమ్మగారి పిల్లలంటూ పనులు చెప్పేవాళ్ళు కాదు. అయినా, కొన్నిసార్లు బలవంతంగా వడ్డన గిన్నెలు తీసుకొని బయలుదేరేవాళ్ళం. బహుశా మేము, బరువైన గిన్నెలు మోస్తూ తిరగటం వాళ్ళకి ఇబ్బందిగా అనిపించేదో లేక వడ్డించటం రావట్లేదని అనిపించేదో, మాకు జగ్గులు ఇచ్చి మంచినీళ్ళు వడ్డించమని చెప్పేవాళ్ళు. మధ్యాహ్నం రెండు గంటలకి అన్నదానం మొదలైతే, రాత్రిదాకా జరుగుతూనే ఉండేది. బాబా మందిరం కాక, ఇప్పుడు కేవలం రావి చెట్టే అమ్మమ్మ జ్ఞాపకంగా మిగిలింది.

✲

# అమ్మమ్మ

**నా**న్నగారు (శ్రీ కొండముది లక్ష్మీనరసింహారావుగారు) సేకరించిన వివరాల ప్రకారం, 22 జనవరి, 1915 నాడు మునిపల్లెలో (గుంటూరు జిల్లా) అమ్మమ్మ జన్మించింది. ఆ రోజు రథసప్తమి, శుక్రవారం, రేవతీ నక్షత్రం. సమయం తెలియదు. అమ్మమ్మ తల్లిదండ్రులు శ్రీమతి మునిపల్లె రుక్మిణమ్మగారు, శ్రీ మునిపల్లె శివరామయ్యగారు. శుక్రవారం జన్మించిన కారణంగా తల్లిదండ్రులు లక్ష్మి కామేశ్వరి అని నామకరణం చేసారు. తండ్రిగారైన శ్రీ శివరామయ్యగారు నిత్యానుష్ఠానపరులు. గాయత్రీ మంత్రానుష్ఠానం చేసిన సాధనాపరులు ఆయన. ఆయనకు తగిన ఇల్లాలు రుక్మిణమ్మగారు. ఉన్నంతలోనే, సనాతన సాంప్రదాయాలను, సదాచారాలను ఏనాడు వీడని వ్యక్తిత్వం వారిది.

అమ్మమ్మకి ఒక అక్క సీతామహాలక్ష్మిగారు అని ఉండేవారు. ఆ తర్వాత నలుగురు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. చెల్లెళ్ళు వరుసగా వరలక్ష్మమ్మగారు, వజ్రంగారు, సత్యవతిగారు, సువర్చలగారు. తమ్ముడు భావనారాయణగారు. తమ్ముడికే తన రెండవ కూతురు (చిన్నామ్మ – మునిపల్లె అరుణ)ను ఇచ్చి వివాహం చేసారు.

మునిపల్లె నుంచి దాదాపు పది కిలో మీటర్ల దూరంలోని నందూరుకు చెందినవారు తాతగారు (శ్రీ చుండూరు రామారావుగారు). తల్లిదండ్రులు శ్రీమతి చుండూరు వేంకట సుబ్బమ్మగారు, శ్రీ చుండూరు సీతారామయ్యగారు. సీతారామయ్యగారు మహామంత్రవేత్తగా పేరు గడించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన ముగ్గురు కుమారులను తల్లి సుబ్బమ్మగారు అన్నీ తానై పెంచారు. ఈవిడ అష్టాంగయోగసాధన చేసేవారని ప్రతీతి. ఇంతేకాక, నందూరు

శివాలయంలో దాదాపు ప్రతి రోజు రామాయణ, భారత, భాగవతాది పారాయణలు చేసేవారు.

అప్పటి ఆచారవ్యవహారాల కనుగుణంగా అమ్మమ్మకు చాలా చిన్నవయసులోనే వివాహం జరిగింది. ఎనిమిదేళ్ళకు వివాహం జరిగిందనుకుంటే, అది 1923 సంవత్సరం అవుతుంది. ఆ తర్వాత పన్నెండేళ్ళ వయసుకు అంటే 1927 సంవత్సరానికి కాపురానికి నందూరు రావటం జరిగింది. అమ్మమ్మకి నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. అందరికన్నా పెద్ద – అన్నంరాజు రాధాంబగారు (పెద్దామ్మ– భర్త అన్నంరాజు రామారావుగారు), ఆంజనేయ వరప్రసాదుగారు (పెద్దమామయ్య – భార్య నిర్మలగారు), మునిపల్లె అరుణగారు (చిన్నామ్మ– భర్త మునిపల్లె భావనారాయణగారు), సీతారామమూర్తిగారు (చిన్నమామయ్య – భార్య భానుమతిగారు), కొండముది నిర్మల (అమ్మ – భర్త కొండముది లక్ష్మీనరసింహారావుగారు), అయ్యదేవర రాజ్యలక్ష్మి (పిన్ని–లక్ష్మక్కయ్య భర్త –అయ్యదేవర వేంకటేశ్వరరావుగారు).

వారసత్వంగా సంక్రమించిన ఆస్తులు ఏమంత లేకపోవటం, నందూరులో సరైన ఆదాయ వనరులు లేకపోవటంతో వ్యాపారం చేసే నిమిత్తంగా తాతగారు నందూరు వదిలి మోగులూరు, మధిర, నైజాం, మానుకోట తదితర ప్రాంతాలలో ప్రయత్నాలు చేసి, ఫలించక చివరికి పొన్నూరు, గుంటూరు చేరుకొన్నారు. అక్కడే ఎవరో ఆడిటర్ వద్ద గుమాస్తా పనికి కుదురుకున్నారు. అప్పటికే ఆరోగ్యం బాగా దెబ్బతిని ఉంది. క్షయవ్యాధిగా నిర్ధారణ అయ్యింది. దాదాపు 1961–62 సంవత్సరంలో తిరిగి నందూరు చేరుకున్నారు. 1963లో తాతగారు నిర్యాణం చెందారు.

అప్పటికి దాదాపు నలభై ఎనిమిదేళ్ళ వయస్సు అమ్మమ్మకి. భర్త మరణించారు. ఆస్తిపాస్తులేమీ లేవు. పెళ్ళికెదుగుతున్న ఇద్దరు ఆడపిల్లలు. చదువుకుంటున్న ఒక కొడుకు, ఏమంత సాయం చేయలేని చిన్న ఉద్యోగం చేసుకుంటున్న పెళ్ళైన పెద్దకొడుకు. అప్పటికే పెళ్ళైపోయిన ఇద్దరు కూతుళ్ళు మాత్రమే కొద్దో గొప్పో ఓదార్పు. గుండెలు బాదుకుంటూ రోదించాల్సిన పరిస్థితి. నలుగురిలో అలా చేస్తే నగుబాటుగా ఉంటుందనుకుంటే, మనసులోనే కుమిలిపోవాల్సిన దారుణమైన పరిస్థితులు. ఇవి అమ్మమ్మ ఎదుర్కొన్న పరిస్థితులు.



దాదాపు అమ్మమ్మ తోబుట్టువులు, కొడుకులు, కూతుళ్ళు అందరితో

ఏ ఉద్యోగమైనా చేయటానికి కనీసపు చదువు కూడా ఏమాత్రం లేదు. ఎవరినీ చేయి చాచి అడగలేదు. ఆస్తుల పంపకాలలో మోసం జరిగిందని పంచాయితీలు పెట్టలేదు. ఎక్కడా అక్కసు చూపలేదు. కాల పరీక్షకు ధైర్యంగా తలవొగ్గింది. అది కూడా వినయంగానే, వినమ్రంగానే! ఆ ధైర్యానికి ఒక్కటే ఆలంబనం. అది నమ్మకం. దైవం పైన నమ్మకం. బాబా మీద భక్తి. నిజమైన కర్మయోగాన్ని ఆచరించి చూపింది.

గొప్ప గొప్ప సాధనలు చేస్తున్నామని విర్రవీగుతుంటాము. బాబా మీద ఎడతెగని భక్తి అని అతివినయంగా అందరికీ చెప్పుకుంటూ ఉంటాం. అమ్మమ్మ మోసిన కష్టాల్లో మన కష్టం ఏపాటిది? నిజమైన మేరునగధీరత్వమంటే అమ్మమ్మదే!

మహనీయుల జీవితాలు కూడా పూలబాటలేమీ కాదు. కానీ వాళ్ళ జీవితం విలక్షణంగా ఉంటుంది. విలక్షణం ఎందుకంటే, కష్టాలకి కన్నీళ్ళకి, సుఖాలకి సంతోషాలకి అతీతంగానే ఉంటారు. ఆధ్యాత్మికమార్గంలో జీవితాన్ని నడుపుకోవటం కాకుండా, జీవితాన్నే ఆధ్యాత్మికం చేసుకుంటారు. లౌకికమైనా, పారలౌకికమైనా సంబంధ బాంధవ్యాలలో నమ్మకం అవసరం. మరీ ముఖ్యంగా పారలౌకిక విషయాలలో ఆ నమ్మకం అత్యవసరం. కష్టాలు కాలం పెట్టే పరీక్షలు. అవి అధిగమించాలంటే ధైర్యంతోపాటు నమ్మకమూ ఉండాలి. అచంచలమైన భక్తిభావన ఉండాలి. ఇవేమీ లేకుండా దేవుడిని కూడా ఆడిపోసుకుంటూ కూర్చుంటే ఉపయోగం లేదు. అమ్మమ్మ బాటలో నడవాలంటే, మనం ముందుగా చూపాల్సింది ఈ నమ్మకాన్నే, ఈ భక్తినే.

✲

# అమ్మమ్మ - సత్సాంగత్యం

**అ**మ్మమ్మ గురించి వ్రాయాలంటే చాలా కష్టం. ఎందుకంటే ఆధ్యాత్మికంగా శిఖరాగ్రానికి చేరిన అమ్మమ్మ ఎప్పుడూ తను చేసిన మహిమలు ఎవరికీ చెప్పుకోలేదు. ఎందుకంటే ప్రజల మెప్పుల కోసం తన గొప్పలు చెప్పుకునే స్థాయి కాదు అమ్మమ్మది. మౌనంగా తన పని తను చేసుకుపోయేది. అదృష్టవంతులై ఆ మహిమలు చూసి, అనుభవించినవారు వాటిని తమ ప్రత్యేకమైన వైయుక్తికమైన అనుభవాలుగా దాచుకోకుండా నలుగురితో పంచుకుంటే తప్ప ఆ విషయాలు ఎవరికీ తెలిసేవి కాదు. తెలిసినా, అమ్మమ్మ నైజం తెలిసినవాళ్ళు గనుక వాటికి మరికొంత చేర్చి ప్రచారం చేసే బాజాభజంత్రీలు కంత్రీలు అయిన శిష్యులు కూడా లేరు. ఒకవిఠల్‌బాబాకు నమస్కరించినా, మరో విశ్వంబాబాకు నమస్కరించినా ఏ మాత్రమూ పటాటోపం లేని నిష్కల్మషమైన ఆత్మానుసంధానమే అమ్మమ్మలో కనిపిస్తుంది కానీ, నలుగురు చెప్పుకునేవారి మహిమలు చూసి మోహపడి మాత్రం కాదు. విచిత్రం ఏమిటంటే, అమ్మమ్మ మహిమలు తమ మహిమలుగా ప్రచారం చేసుకున్న సాధుపుంగవులు మాత్రం ఉన్నారని నాకు తెలుసు.

దాదాపు ఏడెనిమిదేళ్ళ వయసులో ఎవరో అమ్మమ్మకు షిర్డీబాబా పటం ఇచ్చి, ఆ పటం ఎదురుగా ఒక అగరుబత్తీ వెలిగించి ఆ అగరుబత్తీ అయిపోయేదాకా తదేకంగా పటంలోని బాబానే చూస్తూ ఉండమని ఉపదేశం చేసారు. తదేకదీక్షతో తన సాధన కొనసాగించింది అమ్మమ్మ. ఆటపాటల వయసులోనే ఏమిటో ఆ వివశత్వం! ఆ వయసుకే ఆధ్యాత్మికంగా ఏం సాధించాలన్న తపన? ఏమిటా



శ్రీశ్రీశ్రీ లక్ష్మీకాంత యోగీంద్రులతో...

ధైర్యం? ఆ వయసుకే దైవాన్వేషణలో మునిగి తేలటం అమ్మమ్మలాంటి మహనీయులకే సాధ్యం. తీర్థయాత్రల పేరుతో విలాసవిహారయాత్రలు చేస్తూ, షడ్వర్గాలకు లోబడుతూ సాధన చేస్తున్నామని విర్రవీగే నా బోంట్లకు ఈ వయసుకు కూడా ఆ అన్వేషణ అర్థంకాకపోవటంలో ఆశ్చర్యం లేదు.

దాదాపుగా వంద సంవత్సరాల క్రితపు ఆంధ్రదేశం ఇది. అప్పటికింకా ఇక్కడ చాలామందికి షిర్డీ సాయిబాబా తెలియనే తెలియదు. తెలిసినవారికైనా ఓ ముస్లీము ఫకీరుగానే తెలుసు. ఒక బ్రాహ్మణ సాంప్రదాయ కుటుంబంలో పుట్టి, అందునా ఒక బాలిక తన పెట్టెలో దాచుకున్న ఆ సాయిబాబా పటం తోడుగా సాధన మొదలుపెట్టడమనేది ఈనాటికీ ఆశ్చర్యం కలిగించే విషయమే. అంతేకాదు, స్వతంత్రించే స్త్రీలను గర్హించే రోజులవి. ఆధ్యాత్మిక సాధనలలో సాంప్రదాయేతర విధానాలను అంగీకరించని వ్యవస్థ అప్పటిది. అందునా ఒక హైందవేతరుడుగా భావించిన బాబాను భగవంతుడుగా ఆరాధించటం సనాతన సాంప్రదాయాలు పాటించే బ్రాహ్మణుల ఆలోచనకు కూడా సాధ్యపడని విషయం.

మరి తాతగారు, అత్తింటివారు ఏమీ అనలేదా అనే సందేహం రావొచ్చు. ఉత్తమ గృహస్థులైన కారణంగా వాళ్ళెవరూ ఏనాడు అమ్మమ్మని అధైర్యపరచలేదు. సత్సంకల్పంతో సాధన చేసుకుంటానంటే సకల చరాచరజగత్తు అందుకు తోడ్పాటు అందించటమనేది అమ్మమ్మ విషయంలో ఈ విధంగా ఋజువైంది. ఆ వయసుకే సాధన మొదలేసిందంటే, భగవత్కృప కూడా ఏ స్థాయిలో ఉందో తెలుస్తూనే ఉంది కదా! మరి అలాంటి పరిస్థితుల్లో దైవం ఆదరించకుండా ఎలా ఉంటాడు? పరిస్థితులు అనుకూలంగా మార్చకుండా ఎలా ఉంటాడు? సాయిబాబా పటాన్ని తన పెట్టెకే పరిమితం చేసినా, తాతగారి తోడ్పాటుతో అపరిమితమైన సాధనతో త్వరలోనే అత్యున్నతమైన ఆధ్యాత్మికస్థితికి అమ్మమ్మ చేరుకొంది.

మహిమలే కాదు, అమ్మమ్మ తన బాధలని, భావోద్వేగాలని కూడా ఎవరితోనూ పంచుకున్నట్లు నాకైతే తెలియదు. నలుగురి మధ్యా ఉన్నా, నందూరులో ఒంటరిగానే ఉంది. చుట్టపుచూపుగా వెళితే, మృదువుగా నవ్వుతూ పలకరించేది. ఆప్యాయంగా అన్నం పెట్టేది. ఏనాడు తన జీవితంలోని గొప్ప సంఘటనలు ఎవరితో పంచుకోలేదు. తన గురించి వ్రాస్తామని వచ్చినవారికి చెప్పిన నాలుగైదు సంగతులు కూడా అంతకుముందు అందరికీ తెలిసినవే.



ఇసుకపల్లి బాబా మందిరంలో
వేమూరి వెంకటేశ్వరరావు గారితో...

అయినా అనుకుంటాం కానీ, ఇతరుల మెప్పుకోసం ప్రయత్నించేవాళ్ళు మహనీయులెందుకు అవుతారు? దైవం తనకు నిర్దేశించిన గమ్యంవైపు నిశ్శబ్దంగా తన ప్రయాణం తాను చేసింది. ఈ ఆంతరిక ప్రయాణంలోని ఒడుదుడుకులైనా, మెళకువలైనా ఎవర్తికైనా చెప్పిందేమో తెలియదు. చెప్పి ఉండకపోవచ్చు అనే అనుకుంటున్నాను. ఎవరికివారు తాము అమ్మగారి శిష్యులమని చెప్పుకోవటమే కానీ, అమ్మమ్మ మాత్రం ఎవరినీ తన శిష్యులుగా భావించినట్లు నాకైతే తెలియదు. ఒక్క పెద్దామ్మకు, మా నాన్నగారికి తప్ప, మరెవరికీ మంత్రోపదేశం చేసినట్లు తెలియదు. అమ్మమ్మ ఉపదేశమల్లా ఒక్కటే, బాబాను సంపూర్తిగా విశ్వసించమనే.

అమ్మమ్మ కూడా బాబాలానే తన గురువు గురించిన వివరాలేవీ ఎవరితోనూ పంచుకోలేదు. కాబట్టి, అమ్మమ్మ ఎటువంటి మంత్రసాధనలు చేయలేదని తీర్మానించలేము. అమ్మమ్మ ఖచ్చితంగా మంత్రానుష్ఠానం చేసేదని నా నమ్మకం. బాబాయే అమ్మమ్మకు మార్గనిర్దేశం గావించిన యోగి అని కూడా నా నమ్మకం. శ్రీ మామిడివర్ఝుల వేంకటసుబ్బయ్యగారనే రాజరాజేశ్వరీ ఉపాసకులు అమ్మమ్మకు శ్రీ రాజరాజేశ్వరీ మంత్రోపదేశం చేసారని ఈమధ్యనే తెలిసింది.

అంతేకాక, రెడ్డిపాలెంలోని శ్రీ లక్ష్మీకాంత యోగీంద్రులతో కూడా అమ్మమ్మ తరచు సంభాషిస్తూ ఉండేది. ఆయన కూడా అమ్మమ్మతో మాట్లాడటానికే తరచూ నందూరు కూడా వస్తూపోతూ ఉండేవారు. 1965లో శంఖుస్థాపన చేయబడిన నందూరు బాబామందిరం 1967 నాటికి పూర్తిఅయ్యింది. బాబా విగ్రహప్రతిష్ఠ శ్రీలక్ష్మీకాంత యోగివర్యుల చేతుల మీదుగా జరిగింది.

అలానే, జిల్లేళ్ళమూడి అమ్మ దగ్గరకు అమ్మమ్మ తరచుగా వెళ్ళివస్తూ ఉండేది. మొట్టమొదటిసారి వెళ్ళినప్పుడు, అమ్మమ్మ బాబా భక్తురాలని గ్రహించి, తాను బాబాలా కూర్చున్న ఓ ఫొటోను కూడా జిల్లేళ్ళమూడి అమ్మగారు అమ్మమ్మకి ప్రసాదించారట! ఆ ఫొటోకు పటం కట్టించి మరీ తన దగ్గర ఉంచుకున్నది అమ్మమ్మ.

నిరంతర రామనామపారాయణా దీక్షాదక్షులై, అనన్యమైన దాస్యభక్తికి ప్రామాణికంగా నిలచిన శ్రీ రంగన్నబాబుగారు అమ్మమ్మకు బాబా భౌతికదర్శనం చేయించిన మహానుభావులు. ఈయన కూడా తరచుగా నందూరు వస్తూ పోతూ



నందూరు సాయిబాబా మందిరంలో
భాగవతుల గోపాలకృష్ణమూర్తిగారు. వారి భార్య.
జంధ్యాల సీతారామయ్యగారితో...

ఉండేవారు. నందూరు బాబా మందిర నిర్మాణ కార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు.

ఆ తర్వాత, తనంతట తానే బాబాను భౌతికంగా దర్శించాలనే కాంక్షతో దాదాపు పన్నెండు సంవత్సరాలు ఉపవాసదీక్ష చేసింది అమ్మమ్మ! చివరికి షిర్డీలో బాబా ఇచ్చిన జొన్నరొట్టె తిని ఉపవాసదీక్ష విరమించింది! ఎంత పట్టుదల!!

అలానే, మరో ముఖ్యవ్యక్తి శ్రీ వేమూరి వేంకటేశ్వర్లుగారు. తనను బాబా భక్తపాదరేణువుగా ప్రకటించుకోవటమే కాక, ఆజన్మాంతమూ అంతే అణుకువతో బాబా సేవలో తరించిన మహానుభావులు ఈయన. ఈయనే తెలుగులో మొట్టమొదటి సాయిబాబా సచ్చరిత్ర అనే పారాయణగ్రంథం రచించారు. భక్తిపారవశ్యంలో పోతన భాగవతానికి సరితూగే స్థాయిలో వ్రాసిన ఈ గ్రంథాన్ని అమ్మమ్మ ముద్రింపచేసింది. అంతేకాక, శ్రీసాయి సత్యవ్రతం కూడా ఈయనే వ్రాసారు.

ఇందరు మహానుభావుల సత్సాంగత్యంతో తన ఆధ్యాత్మిక మార్గాన్ని మరింత పరిపుష్టం చేసుకుంది అమ్మమ్మ. అంతేకాదు, కష్టాలు చెప్పుకుందామని వచ్చే ప్రతివారికి అమ్మమ్మ సాంగత్యంలో కలిగే స్వాంతన చెప్పనలవి కాదు. నాలుగు నెలల వేసవితాపం తర్వాత కురిసే చిరుజల్లులలో కలిగే ఆనందం, ఎడతెరిపిలేని వర్షం తర్వాత ఉదయించే సూర్యుడిని చూస్తే కలిగే ఆనందం అమ్మమ్మ దగ్గర లభించేది. దగ్గర చేరిన ప్రతివారికీ దీపంలా దారి చూపించేది.

అయినా, అమ్మమ్మ ఎటువంటి సాధనలు చేసిందనే విషయంపై చర్చ దేనికి? ఎన్ని వేల జన్మల సంస్కారం ఉంటే మనుషులుగా పుడతాం? మరెన్ని జన్మల సంస్కారం కలసి వస్తే ఇటువంటి యోగులతో అనుబంధం ఏర్పడుతుంది. మనిషిగా పుట్టామంటేనే మోక్షసాధనా మార్గంలో మొదటి అడుగు ఎక్కినట్లే. కాబట్టి, అమ్మమ్మకు అసలైన నివాళి అర్పించాలంటే, పవిత్రంగా బ్రతుకుతూ సంస్కారవంతమైన జీవనాన్ని అలవరచుకోవటమే. కనీసం, అమ్మమ్మ సాధనలో ఒక వంతు చేయగలిగే స్ఫూర్తి రగిలితే చాలు. జీవితం ధన్యమౌతుంది.

✲

# అమ్మమ్మ - కొన్ని మహత్యాలు

**అ**మ్మమ్మ అన్న పదమే ఎంత పవిత్రంగానో వినిపిస్తుంది కదా! గుడిగంట శబ్దంలా, పసిబిడ్డ నవ్వులా, నదీప్రవాహంలా, వెన్నెల కడిగిన రాత్రిలా! ఎంత పవిత్రంగా జీవించిందండి అమ్మమ్మ! చేసిన ప్రతిపనీ పవిత్రంగా చేసింది.

బాబాకు రోజూ మహానైవేద్యం ఇచ్చేప్పుడు ఆ గుడిగంట శబ్దంలా... 'జయ జయ జగదేక రక్షామణి, దైవచూడామణి...' అంటూ గణపతి దండకంతో మొదలుపెట్టి, శివలింగ దండకం ఆ తర్వాత 'స్వామీ చంచలమైన చిత్తమిదే..' అంటూ శ్రీకాళహస్తీశ్వరుని తలచుకొని వెంటనే 'శ్రీసాయిరామా లసద్దివ్యనామా జగత్సార్వభౌమ...' అంటూ తాతగారు వ్రాసిన సాయిబాబా దండకంతో ఒక్కసారిగా శ్రోతలని తాదాత్మ్యపు శిఖరానికి చేరువ చేసేది. ఆ తరువాతి పద్యాలు వింటున్న ప్రతి వ్యక్తీ లీనమై తానే అవి పాడుతున్నట్లు భావించుకుంటారంటే అనుమానమే లేదు.

ఇప్పటికీ, ఆ జ్ఞాపకాల తెమ్మెరలు కంటిరెప్పల మాటున చినుకులై దాగినప్పుడు, గుండెగోడల మధ్య మార్దవంగా ఆ స్వరం ప్రతిధ్వనిస్తుంది. అమ్మమ్మ పలకరిస్తుంది.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తాతాగారు చాలా మంచికవి. ఆశువుగా ఎన్నెన్నో పద్యాలు చెప్పేవారు. నిత్యానుష్ఠానపరులైనా, సాయిబాబాను నమ్మే అమ్మమ్మకు ఏనాడు అణుమాత్రం కూడా బాధ కలిగించక పోవటమే కాకుండా, కాలక్రమంలో తానూ బాబా భక్తులై, బాబాపై అనేకానేక పద్యాలు, దండకాలు కూడా వ్రాసారు తాతగారు.

ఇందాక చెప్పుకున్నాం కదా, తాతగారు ఉద్యోగవ్యాపారాల నిమిత్తం చాలా ఊళ్ళు తిరిగేవారని. ఎక్కడ ఏ ఊళ్ళో, ఎలా ఉన్నా, ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమికి మాత్రం నందూరు చేరేవాళ్ళు అమ్మమ్మ తాతయ్యగారు. ఎందుకంటే, ప్రతి కార్తీక పౌర్ణమికి నందూరు శివాలయంలో క్రమం తప్పకుండా లక్ష బిల్వార్చన చేసేవారట! అమ్మకు తెలిసీ, దాదాపు అయిదారుసార్లు అమ్మమ్మ శ్రీశైలం కూడా వెళ్ళివచ్చిందట. అలానే, కోటప్పకొండ కూడా. ఈ రోజుల్లో ప్రయాణాలు అంత కష్టంగా మనకు అనిపించకపోవచ్చు కానీ, ఆ రోజుల్లో ఆ ప్రయాణాలు పెద్ద ప్రయాసే! అందుకేనేమో, కోరిందే తడవుగా కాశీ విశ్వనాథుడు అమ్మమ్మ వద్దకే గంగను మళ్ళించాడు!

ఈ సంఘటన అమ్మమ్మ గుంటూరులో వరాలమ్మమ్మ వాళ్ళింట్లో ఉన్నప్పుడు జరిగింది. ఎవరో పరిచయస్తులు కాశీనుండి తిరిగి వస్తూ అమ్మమ్మ కోసం కాసిన్ని గంగాజలం తీసుకువచ్చారట. తామున్న పరిస్థితుల్లో కాశీకి వెళ్ళే భాగ్యం లేదని, గంగాస్నానం చేసే అవకాశం లేదని అమ్మమ్మ బాధ పడిందట. అంతే, అక్కడి బాబా ఫొటో నుంచి నీళ్ళు కారటం మొదలయ్యింది. ముందు ఓ గ్లాసుతో పట్టారు. నిండింది. చెంబులు తెచ్చారు. నిండాయి. ఇలా కాదని ఒక బిందె తెచ్చారు. నిండింది. అలా మరో రెండు బిందెలు నిండాయి. తాతయ్య, అమ్మమ్మ దంపతులు చెరో బిందెడు నీళ్ళతో స్నానం చేసి, మరో బిందెడు నీళ్ళు ఆ వింత చూద్దామని వచ్చిన ప్రజలకు తీర్థంగా ఇచ్చారు.

ఈ మహత్యం మొదటిదీ కాదు, చివరిది అంతకన్నా కాదు. బాబా విగ్రహం నుండి తేనె కారటం. అమ్మమ్మ చేతుల్లో ఆ ఋతువుకు సంబంధించని పూలు రావటం, మీద అక్షింతలు పడటం, చేతుల్లో పటికబెల్లం ముక్కలు, పాలకోవాలు రావటం ఇలా ఎన్నెన్నో సోకాల్డ్ మహత్యాలు విరివిగా జరిగేవి. ఒక సమయం సందర్భం లేకుండా, వాటంతట అవి అలా ప్రత్యక్ష తార్కాణాలుగా ప్రకటింపబడేవి. వీటినే ప్రామాణికంగా భావించే నాలాంటి పామరజనం కూడా ఈ మహత్యాలు చూడటానికి విరగబడి వచ్చేవారు.

శంకరులవారి పీఠపరంపరలలోని సాధకులు, సన్యాసులు కొందరు పరీక్షించేందుకు కూడా వచ్చేవారు. అలానే, సాంప్రదాయవాదులు కొందరు అమ్మమ్మను పరీక్షించేందుకే వచ్చేవారు. అలా వచ్చినవారిలో ఒకరు శ్రీ మిన్నికంటి

గురునాథశర్మగారు. అమ్మమ్మకు ఈయన స్వయానా బాబాయి, కాకపోతే మిన్నికంటివారికి దత్తత వెళ్ళారు. ఆయన సనాతన సాంప్రదాయవాది. పంచాక్షరీ మంత్రోపాసకులు. కవి, పండితులు.

"జనాలు ఇందరు తండోపతండాలుగా వస్తున్నారు. నిజంగా మహత్యమే చేస్తున్నావా, లేక కనికట్టులాంటి విద్యలేమైనా నేర్చావా?" అని అమ్మమ్మను ప్రశ్నించారు ఆయన. అమ్మమ్మ నవ్వి ఊరకుందిట. "సరేలే నమ్ముతాను కానీ నా కళ్ళముందు ఈ మహత్యాన్ని ప్రదర్శించవే కాముడు!" అని ఆయన సవాలు విసిరారు. ఏమీ మాట్లాడకుండా తన ధ్యానంలో తాను నిమగ్నమయ్యింది అమ్మమ్మ. కాసేపటికి, ఆయన కుడి అరచేయి బరువెక్కటం మొదలయ్యింది. తెరుచుకోవటం లేదు కొంతసేపటి వరకు. ఆ కాసేపటి తర్వాత చూస్తే, ఆయన చేతిలో కలకండ! ఆ ప్రసాదాన్ని స్వీకరించి, మనసారా, ఆశీర్వదించి వెళ్ళారట ఆ మహానుభావుడు.

అంతేకాదు, శ్రీశైలక్షేత్రంలోని ఓ గుహలో భూతగణ పరివేష్ఠితుడైన కాలభైరవ సాక్షాత్కారం కూడా కలిగిందని అమ్మమ్మ చెప్పినట్లుగా తన్మయిగారు శ్రీ సాయిలీలా తరంగిణిలో చెప్పారు.

కాలక్రమంలో ఇటువంటి మహత్యాలు తగ్గిపోయాయి. బహుశా, సాధనకు ఆటంకమని భావించి తనే వద్దనుకుందేమో అమ్మమ్మ. కానీ, అమ్మమ్మ వాక్ సిద్ధి మాత్రం చాలామందికి పరిచయమే. అమ్మమ్మ నోటవెంట మాట రావాలే కానీ, వచ్చింది వచ్చినట్లు జరిగి తీరాల్సిందే. రహీమ్ అనే వ్యక్తి ఉదంతం ఇందుకు ఓ పెద్ద నిదర్శనం. ఆయనకు ఓ ఆడపిల్ల. పోలియోతో కాళ్ళు చేతులు సరిగా లేవు. పెళ్ళి కావటం లేదు. అందుకని, నందూరులో అమ్మమ్మ దగ్గర వదిలివెళ్దాం, సాధ్యమైనంతలో అమ్మమ్మకు సేవ చేసుకుంటుందనే ఉద్దేశ్యంతో తన కూతురుతో నందూరుకు వచ్చాడు ఆయన. వచ్చీరాగానే, కాళ్ళకు నమస్కరించిన ఆ ఆడబిడ్డని, "శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు!" అని అమ్మమ్మ దీవించింది. రహీమ్‌కు కళ్ళు బైర్లు కమ్మినాయి. "పెళ్ళికావటం లేదని ఇక్కడకు తీసుకొస్తే, అమ్మ ఇలా అన్నారేమిటని?" ఆశ్చర్యపోయాడు. అదే మాట అమ్మమ్మని అడిగితే, "బాబా పలికించాడు, నేనేం చేయను?" అని నవ్విందిట!

ఆ తర్వాత కొన్ని వారాలకు, ఇంజనీరింగ్ చదివిన ఓ నక్సలైటు జనజీవన స్రవంతిలోకి వచ్చి, ఒక ఆదర్శవివాహం చేసుకోవాలని నిర్ణయించుకొని ఈ అమ్మాయిని చేసుకోటానికి ముందుకు వచ్చాడట! అమ్మమ్మ ఆశీర్వాదం కోసం కూతురు, అల్లుడిని నండూరుకు తీసుకొచ్చిన ఆ వ్యక్తికి అమ్మమ్మ మహాప్రస్థానం చూసి గుండెలు బాదుకుని ఏడ్చిన ఘట్టం ఎవరూ మరిచిపోయి ఉండరు.

తాను ఈ రోజు సమాధిలోకి వెళుతున్నానని, ఏకాదశినాడు మాత్రమే తన నిర్యాణం అని అయిదురోజుల ముందే ప్రకటించి చివరికి 29 జులై,1993 నాడు పరమపదించింది అమ్మమ్మ.

✲

# అసతోమా సద్గమయ

అమ్మమ్మకు సంబంధించిన విషయాలపై నాకు అవగాహన కలుగుతున్నప్పుడు నా వయసు దాదాపు 11-12 సంవత్సరాలు. ఇంటి ఆరాధ్యదైవం సూర్యనారాయణుడైనా, బాబా పటాలే ప్రముఖంగా కనిపించేవి మా గూటిలో! నిజం చెప్పాలంటే, ఆ వయసుకు బాబా దేవుడంటే నాకు చిన్నతనంగా కూడా అనిపించేది. నా స్నేహితులు వాళ్ళ ఆరాధ్యదైవాలుగా వేంకటేశ్వరస్వామి అనో, వినాయకుడనో, ఆంజనేయస్వామి అనో చెబుతున్నప్పుడు నేను సాయిబాబా అని చెప్పుకోవటానికి సిగ్గుపడేవాడిని! సకలాభరణ భూషితులైన ఆయా దేవుళ్ళ ముందు చింకిపోయిన, మాసిపోయిన బట్టలు వేసుకున్న సాయిబాబా దేవుడంటే మనసు ఒప్పుకునేది కాదు! అదీ అప్పటికి నాకున్న ఆధ్యాత్మిక పరిణతి! ఇక పైగా, కథలుగా చదువుకున్న సాయిబాబా సచ్చరిత్రలో విషయాలు నమ్మశక్యంగా కూడా ఉండేవి కావు. దానికితోడు, అమ్మమ్మకు సంబంధించిన అనుభూతులు అప్పుడప్పుడే తెలుసుకుంటున్న వయసు. వీటితోపాటు ఊపిరి పోసుకుంటున్న రాడికల్ భావాలతో దేవుని ఉనికినే ప్రశ్నార్థకం చేస్తూ పెనుభూతాలుగా పెరిగిపోతున్న అనుమానాలు!

ఆ రోజు నాకు చాలా గుర్తే! అప్పుడు మేము భద్రుడు మామయ్యవాళ్ళ ఇంట్లో (విజయా టాకీసు ఎదురు సందులో) ఉండేవాళ్ళం. అమ్మమ్మ నండూరు నుండి వచ్చింది. మా ఇంటికి దగ్గరలోనే ఉన్న సావిత్రమ్మగారు బాబా సప్తాహం కోసం అమ్మమ్మని పిలిచారుట. నాకేమో అప్పుడు యూనిట్ టెస్ట్ పరీక్షలు జరుగుతున్నాయి. అయినా, అమ్మమ్మకు, బాబాకు బోలెడు మహత్తులు ఉన్నాయి కదా, వాళ్ళనే చూసుకొమ్మందాం అనే ఓ పెంకి ఆలోచనతో ఏ మాత్రమూ

చదువుకోకుండా అమ్మమ్మ కూడా తిరిగాను. ముఖ్యంగా లెక్కల పరీక్ష ముందు రోజంతా, సావిత్రమ్మగారింట్లో భజన చూసే నెపంతో గడిపేసాను. పరీక్ష వ్రాసిన రోజే అమ్మమ్మకు చెప్పేసా "పరీక్షలు ఏమాత్రం సరిగ్గా వ్రాయలేదు. పాసు చేయించే పూచీ నీదే" అని. నవ్వుతూనే, నాకు చెప్పాల్సిన రీతిలో మెల్లగా నొచ్చుకోకుండా ఏవేవో చెప్పింది అమ్మమ్మ. అవేమీ అర్థంచేసుకునే ప్రయత్నం చేయలేదు. పాతిక మార్కుల పరీక్షలో ఏడో ఎనిమిదో మార్కులు! ఆ దెబ్బకి బాబాకు వ్యతిరేకంగా ఊపిరి పోసుకుంటున్న నా అనుమానాలు ఊడలు పెంచుకున్నాయి. ఏ పరీక్షలోనైనా ఎదురు నిలవగలిగే ధైర్యం స్థైర్యం మనంతట మనమే సంపాదించు కోవాలని అమ్మమ్మ చేసిన ఉపదేశం చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే అయ్యిందంటే అతిశయోక్తి కాదు.

వీళ్ళని నమ్ముకుంటే లాభం లేదని, కష్టపడి చదువుకున్నా. ఏడో తరగతి పరీక్షలు కూడా అయిపోయాయి. ప్రతి సంవత్సరంలానే వేసవి సెలవులకి నందూరు వచ్చాను. ఆ రోజు సాయంత్రం నందివర్ధనం చెట్టు దగ్గర చాప వేసుకొని అమ్మమ్మ, పక్కన నేను కూర్చున్నాం. అమ్మమ్మకి నా చేయి చూపించి భవిష్యత్తు చెప్పమని విసిగిస్తున్నాను వేళాకోళం చేయాలన్న దురాలోచనతో. చేయి చూస్తూ అమ్మమ్మ చెబుతున్నది. "విమానాల్లో తిరుగుతావు. చక్కగా ఉద్యోగం చేసుకుంటావు..." అంటూ.. "సరే, పెద్దమామయ్యలా గొప్పవాడిని అవుతానా?" అని నేను ప్రశ్నిస్తుండగా ఇంతలో స్టేషన్ మాస్టరుగారి భార్య (ఆవిడ పేరు మర్చిపోయాను) వచ్చారు. ఆవిడని పలకరిస్తూ... ఉన్నట్లుండి మళ్ళీ నా కుడిచేయి తన ఎడమ చేతిలో పట్టుకొని, నా గుప్పిట మూసి ఓ రెండు మూడు క్షణాల తర్వాత తనే తీసింది. మొట్టమొదటిసారి, నా జీవితంలో ఒక అద్భుతాన్ని చూసిన రోజది. నా చేతిలో పాలకోవ! ఎక్కడి నుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో తెలీదు. ఆశ్చర్యంగా చూస్తూ ఉంటే, స్టేషన్ మాస్టరుగారి భార్య "అబ్బాయి, నీ అదృష్టం... అమ్మగారు బాబా ప్రసాదం ఇస్తున్నారు కళ్ళకద్దుకొని తీసుకో" అన్నారు. వేళాకోళం చేయటానికి అమ్మమ్మను జ్యోతిష్యం చెప్పమని విసిగించిన నాకు ఓ చెంపపెట్టు!

మొట్టమొదటిసారి ఓ అద్భుతానికి స్వయానా నేను సాక్షిగా నిలచాను. అనుమానాలన్నీ పటాపంచలై పోయాయి. అమ్మమ్మనే బాబాగా భావించే రోజులకు అదే ప్రారంభం. ఆ అద్భుతానికి కొనసాగింపు కూడా ఆ పూటే జరిగింది.

✲

# తమసోమా జ్యోతిర్గమయ

**మా**మూలుగానే రాత్రి అన్నం తిని పడుకోటానికి మందిరంలోకి వెళ్ళాం. అమ్మమ్మ కోసం మంచం, పక్కలు వేస్తుంటే, మరో పక్కన సుబ్బాయమ్మ (నండూరులో అమ్మమ్మకి ఇంటిపనులకి సహాయంగా ఉండేది, అలానే రాత్రి పూట తోడుగా పడుకోటానికి కూడా వచ్చేది) చిమ్ముతున్నది.

ఇంతలో ఉన్నట్లుండి అమ్మమ్మ "సుబ్బాయమ్మ, కాసేపు చిమ్మటం ఆపు, బాబావారు వస్తున్నారు" అని పలికింది. ఆవిడ చిమ్మే చోటు నుంచి అమ్మమ్మ వైపుకు వచ్చి నిలబడింది. నేను దిక్కులు చూస్తున్నాను బాబా ఎక్కడా అని వెతుకుతూ... కాసేపు తదేకంగా ఆవైపు చూస్తూ, ఇక అమ్మమ్మ మంచం మీద నడుం వాల్చింది. ఇక మళ్ళీ విసిగించటం మొదలుపెట్టాను. ఇక్కడే మరో విషయం చెప్పుకోవాలి. అమ్మమ్మ గుంటూరులో మా ఇంటికి వచ్చినా, నేను నండూరు వెళ్ళినా అమ్మమ్మ ఎప్పుడు పడుకున్నా కాళ్ళు నేనే పట్టేవాడిని. నేను ఉన్నప్పుడు నాకు మాత్రమే ఆ హక్కు ఉందన్న ధీమాతో ఎవరినీ చేయి వేయనిచ్చేవాడిని కాదు.


అలా కాళ్ళు వత్తుతూ విసిగించటం మొదలేసా... "బాబా నీకే ఎందుకు కనిపించాడు. పక్కనే ఉన్న నాకు ఎందుకు కనిపించలేదు. నేను ఇప్పుడే ఇక్కడే బాబాను చూడాలి. ఏం చేస్తావో తెలీదు" అంటూ అమ్మమ్మను నిద్రపోనీలేదు. చివరికి అమ్మమ్మ ఓ రెండు మాటలు చెప్పింది. "ఒరేయ్ కిష్టిగా.. నువ్వు ఏ పని చేసినా బాబాను తలుచుకొని చేయి. నీకు తప్పకుండా కనబడతాడు". సరే, పిల్లచేష్టలు ఎక్కడికి పోతాయి. "సరే, బాబానే తలుచుకుంటూ నిద్రపోతాను కానీ,

నాకు బాబా కనిపించాల్సిందే” అంటూ నేను షరతు పెట్టా. “సర్లే పడుకోరా... బాబా కనిపిస్తాడుగా” అంది అమ్మమ్మ. ఆవిడ నాతో విసుగెత్తే అలా అన్నదో, నిజంగానే అన్నదో అర్థమయ్యేటప్పటికి దాదాపు పది పన్నెండేళ్ళు గడిచాయి. అది ఎలా జరిగిందో చదవండి.

1992వ సంవత్సరం. నేను ఢిల్లీలో ఉద్యోగం చేసుకుంటున్నాను. ఓ అర్జెంటు పనిబడి, మా ఆఫీసువాళ్ళు నన్ను ఔరంగాబాదులో ఉన్న మహారాష్ట్ర డిస్టిలరీస్‌కు ఫ్లైటులో పంపారు. అప్పట్లో విమానం ఎక్కి వెళ్ళటమంటే అదో గొప్ప వ్యవహారంలా తోచింది. ఇంకేమీ ఆలోచించకుండా ఢిల్లీ నుంచి వయా ముంబాయి ద్వారా ఔరంగాబాదు చేరాను. సాయంత్రం 3 గంటలకల్లా పని పూర్తయ్యింది. సరే కదా అని, రిటర్న్ ఫ్లైట్ బుక్ చేయించుకుందామని ఢిల్లీకి ఫోను చేసి పర్మిషన్ అడిగితే, ఇక పని అయిపోయిందిగా, ట్రైనులో వచ్చేయమన్నారు. చాలా చిరాకేసింది. అప్పటికప్పుడు ట్రైనులో వెళ్ళాలంటే టిక్కెట్లు ఎలా దొరుకుతాయని విసుక్కుంటూనే ఓ ఆటోలో స్టేషనుకు బయలుదేరాను.

ఔరంగాబాదు స్టేషను దగ్గర దిగి, ఆటో అతనికి డబ్బులు ఇస్తుంటే, అతను ఎగాదిగా చూసి “సాబ్ ఇత్నా దూర్ ఆ హీ గయే తో, బాబాజీ కా దర్శన్ కర్కే జావో” అన్నాడు. కాసేపు అర్థం కాలేదు ఏ బాబాను దర్శనం చేసుకోమంటున్నాడో. అదే అడిగితే, “షిర్డీవాలే బాబాకా దర్శన్” అని చెప్పాడు. విచిత్రం ఏమిటంటే, చిన్నప్పటి నుంచి కొన్ని వందల సార్లు సాయి సచ్చరిత్ర చదివాను. అయినా, ఔరంగాబాదుకు కొద్ది దూరంలోనే షిర్డీ ఉన్నదనే విషయం మనసులోకే రాలేదు. సరే ఎలా వెళ్ళాలో అడిగితే, అతనే అక్కడి నుంచి బస్‌స్టాండుకు తీసుకెళ్ళి, బస్సు ఎక్కించాడు. అక్కడి నుంచి షిర్డీ చేరి, 10 రూపాయలకో బస తీసుకొని స్నానం చేసి బాబా మందిరానికి వచ్చేటప్పటికి అక్కడ హారతి జరుగుతున్నది.

ఉత్తరాది రాష్ట్రాలలో, మహారాష్ట్రలో కూడా హారతి ఇచ్చేటప్పుడు ఎవరూ కూర్చోరు, అటూ ఇటూ తిరగరు. నాకు అవేమీ తెలీదు. బయట కొన్న పూలు, కొబ్బరికాయ అక్కడే సమాధి పక్కన పెట్టి, నమస్కారం చేసి ఓ ప్రదక్షిణ చేసి కొద్దిగా దూరంగా కూర్చున్నాను. హారతి వింటూ ధ్యానంలోకి జారిపోయాను. అప్పుడు గుర్తుకు వచ్చింది నా చిన్నప్పుడు బాబాను చూపించమని నేను మారాం చేసిన విషయం. ఆ ధ్యానంలోనే, ఆ రోజు నాకు నిద్రలో కనిపించిన బాబా



అమ్మమ్మ - లక్ష్మీబాయి షిండే

మందిరం, ముఖ్యంగా బాబా భక్తుల ఫోటోలు అన్నీ... సినిమాల్లో ఫ్లాష్ బాక్ లాగా! కళ్ళ వెంబడి ధారాపాతంగా నీళ్ళు. ఇంతలో ఎవరో తల మీద చేయి పెట్టి పిలుస్తున్నారు. చూస్తే, అక్కడ హారతి చేసిన పూజారి, "బేటా ప్రసాద్ లో" అంటూ చేతిలో కోవా పెట్టాడు! ప్రసాదం తీసుకొని లేచి చుట్టూ చూస్తుంటే, అప్పుడు నాకు కలలో కనిపించిన దృశ్యాలే రిపీట్ అయ్యాయా అన్నట్లు అవే ఫోటోలు. ముఖ్యంగా బాబా తొమ్మిది నాణాలు ఇచ్చిన లక్ష్మీబాయి షిండే ఫోటో, అచ్చు అమ్మమ్మలా పలకరిస్తున్నట్లు అనిపించింది. ఇప్పటికీ సమాధి దగ్గర, బాబా దర్శనంతో పాటు ప్రత్యేకించి ఆవిడని చూడకుండా మాత్రం వెనుదిరగను. ఇప్పటి రోజుల్లా కాకుండా, దాదాపు గంటపైన బాబా సమాధి మందిరం దగ్గరే ఉన్నాను.

✲

# అజ్ఞాన తిమిరాంధస్య

అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా।
చక్షురున్మీలితం యేన తస్మైశ్రీ గురవేనమః॥

కంటిలోని నలుసును తొలగించినట్లుగా శిష్యుడి అజ్ఞానమనే అంధకారాన్ని జ్ఞానమనే అంజనంతో తొలగించే గురువుకు నమస్కారములు.

1988 చివరిలో అనుకుంటాను నాకు ఈనాడులో ఫొటో లెటరింగ్ మెషీన్ ఆపరేటర్‌గా తిరుపతిలో ఉద్యోగం వచ్చింది. కేవలం ఒక డిగ్రీ, దానితోపాటు ఇంగ్లీషు షార్ట్‌హాండ్, టైపింగు, తెలుగు టైపింగు తప్పించి వృత్తిపరమైన వేరే అర్హతలు లేకపోవటంతో ఆ ఉద్యోగంలో చేరాలా వద్దా అనే మధ్యతరగతి ఆలోచనలలో సతమతమౌతున్నాను. పొన్నూరులో ఉన్న అమ్మమ్మని కలిసి అభిప్రాయం అడిగితే, తిరుపతి వెంకన్న సన్నిధిలో మొట్టమొదటి ఉద్యోగం వచ్చిందిగా చేరమని చెప్పింది. అలానే ధైర్యం చెబుతూ అమ్మమ్మ అన్న మాటలు ఇప్పటికీ గుర్తుగానే ఉన్నాయి. తప్పొప్పులు నిర్ణయించుకోవాల్సిన సంక్లిష్ట పరిస్థితుల్లోనే కాకుండా, తీసుకునే ప్రతి నిర్ణయాన్ని బాబాను ధ్యానించి తీసుకోమని, అంతా ఆయనే చూసుకుంటాడు అని ఆశీర్వదించింది. ఊహ తెలిసిన తర్వాత, జీవనగమనంలో ముఖ్యమైన మైలురాయికి చేరువవుతున్న తరుణంలో, నాకు లభించిన మొట్టమొదటి ఆధ్యాత్మిక ఉపదేశం!


ఏ మంత్రోపదేశమూ చేయలేదు. జీవబ్రహ్మైక్యం గురించి ఉపన్యాసాలిచ్చి ఉద్బోధలు చేయలేదు. ఆత్మనివేదనమనే భక్తిసూత్రాన్ని అంత సరళంగా, సూటిగా

ప్రబోధించింది అమ్మమ్మ. అప్పటినుంచి అమ్మమ్మ స్మరణ చేసిన తర్వాతే మిగతా పూజలు చేసేవాడిని, క్రమక్రమంగా అమ్మమ్మ బాబాల అభేదాన్ని గ్రహించటం మొదలయ్యింది. ఈ సందర్భంలో ఓ అనుభవాన్ని ప్రస్తావించాల్సి ఉంది.

1989 ఫిబ్రవరి మొదటిరోజు. ఆ రోజు బహుశా బుధవారం అనుకుంటాను... నాకు వీక్లీ ఆఫ్. అంతకు ముందు రోజే నెల జీతం ఇచ్చారు. జీవితంలోనే నా మొట్టమొదటి సంపాదన దాదాపుగా రూ. 800/- పైన వచ్చింది. ట్రైనింగు కారణంగా జనవరిలో వారంతపు సెలవలు ఇవ్వలేదు. అందుకని, ఆ రోజు మాత్రం తిరుపతి మొత్తం ఓసారి కలియబెడదామని నిర్ణయించుకున్నా. అప్పట్లో తిరుపతి మహావీర్ టాకీసు ఎదురుసందులో ఓ మిద్దెపైన ఉండేవాడిని ఒక్కడినే. మేనత్త మరిది (బుజ్జమ్మత్తయ్యవాళ్ళ మరిది, గోకులు మామయ్య తమ్ముడు) నేనుండే రూముకు దగ్గరలోనే ఉండేవారు. ఆయన ద్వారా సైకిళ్ళు అద్దెకిచ్చే షాపులో ఓ సైకిలు తీసుకుని పొద్దున్నే ఎనిమిది గంటలకు బయలుదేరాను తిరుపతి పట్టణ విహారానికి! ఊరంతా తిరిగి మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సైకిలు తిరిగి ఇచ్చేసి రూముకొచ్చాను కాసేపు విశ్రాంతి తీసుకొని ఫస్ట్ షో సినిమాకు వెళ్దామని ప్లాను.

3.30 ప్రాంతంలో మేనత్త మరిది రూముకి వచ్చారు. అద్దెకు తీసుకున్న సైకిలు నేనింకా తిరిగి ఇవ్వలేదని అద్దెకిచ్చే షాపతను చెప్పాడట, కనుక్కోటానికి వచ్చారాయన. వెంటనే ఆ షాపుకి వెళ్ళి అతనికి నేను తిరిగి ఇచ్చానని నచ్చచెప్పే ప్రయత్నం చేసినా అతను ఇవ్వలేదనే అంటున్నాడు. కావాలంటే, రిజిస్టరు చూసుకోమని దబాయింపు! తిరిగి ఇచ్చిన తర్వాత ఆ రిజిస్టరులో పేరు కొట్టేయించుకోవటం మర్చిపోవటంతో వచ్చిన చిక్కు. ఇక పైగా, సైకిలు వెలకింద ఎనిమిది వందలు ఇవ్వమని గోలగోల చేసాడు. ఏడవటమే తక్కువ! సాయంత్రం దాకా టైమివ్వమని బతిమాలి రూముకి వచ్చేసాను. మనసంతా గందరగోళం. ఏం చేయాలో, ఎవరికి చెప్పుకోవాలో పాలుపోని పరిస్థితి.

రూముకి రావటం ఆలస్యం ఆపుకోలేనంత ఏడుపు. ధారాపాతంగా కన్నీళ్ళు. మొట్టమొదటి జీతం అలా ధారపోయాల్సి వస్తున్నదనే నిస్సహాయత. వెంటనే అమ్మమ్మ, ఆ వెంటనే బాబా గుర్తుకొచ్చారు. అంతా బాబా చూసుకుంటాడని అమ్మమ్మ అన్నదే మరి, ఇలానా చూసుకోవటం అని బాబామీద కోపం, రోషం.



నండూరు బాబా

ఇక్కడ నా గారం చూడండి. ఇద్దరికీ సాయంత్రం అయిదు గంటలవరకు టైమిచ్చా, ఆ లోపే, సైకిలు దొరికేట్టు చేయాలని! దిండుకింద ఎప్పుడూ ఉండే సాయిబాబా పటాన్ని చేతిలో ఉంచుకొని ఏడుస్తూనే కళ్ళు మూసుకొని నిద్రపోయా.

ఎవరో తలుపులు బాదుతున్న చప్పుడు. తలుపులు తీసి చూస్తే, మేనత్త మరిది. అంతకుముందు నా పరిస్థితి చూసి ఉన్నాడుగా, ఎంతకీ తలుపులు తీయకపోతుంటే ఏమైనా అఘాయిత్యం చేసుకున్నానేమోనని గాభరా పడుతున్నాడు. ఇంతకి విషయం ఏమిటంటే, నేను సైకిలు తిరిగి ఇచ్చిన తర్వాత, వేరెవరో చెప్పా పెట్టకుండా ఆ సైకిలు తీసుకెళ్ళారుట. ప్రతాప్ సినిమాహాలు బయట ఈ సైకిలు షాపతని తమ్ముడికి కనిపిస్తే తీసుకువచ్చాడట! చూసుకుంటే, టైము అయిదు ఇంకా దాటలా!!

నేనేమీ అభినవ భక్తతుకారామ్‌ని కాదు. తాత్యాపాటిల్లా జన్మజన్మాంతర బంధం కారణంగా బాబా వచ్చి మేలు చేసాడనీ అనుకోను. కేవలం అమ్మమ్మ ఇచ్చిన ఒక్క మాట కారణంగా, మనసు విప్పి చేసుకున్న మొరలు విని బాబా పరుగెత్తి వచ్చి సహాయం చేసాడని మాత్రం చెప్పగలను.

ఈ సంఘటనను ఇప్పుడు తీరిగ్గా పునరావలోకనం చేసుకుంటే, నేనెంత మూర్ఖుడినో అర్థమౌతుంది. కేవలం 800 రూపాయలకు ప్రపంచం తలక్రిందు లయ్యిందని భావించాలా? అందుకు బాబాను అమ్మమ్మను నిందించాలా? చేసిన తప్పు సరిదిద్దమని వాళ్ళను నిలదీయాలా? ఏమిటీ అహంకారం? స్థితప్రజ్ఞత సరే, కనీసంగా ఉండాల్సిన వివేకం ఏమయ్యింది? ఏదేమైనా, ఇటువంటి సంఘటనలు ఖచ్చితంగా ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పరిపుష్టం చేసే దిశగా మనలని పరుగెత్తించాలి. లేకపోతే, ఇవి మన అహంకారానికి చిహ్నాలుగా మిగిలిపోతాయి.

✲

# త్వం మూలాధార స్థితోసి నిత్యం

**ఎ**నిమిదో తరగతి పరీక్షలు అయిన తర్వాత (1982) అనుకుంటాను, ఎప్పటిలాగే వేసవి సెలవల్లో నండూరు వెళ్ళాను. అమ్మమ్మది చాలా సునిశితమైన దృష్టి. చిన్నరాముడి ప్రేరణతో నేను కూడా బండమీద కూర్చున్న బాబా బొమ్మ వేసి, రంగులు అద్ది, పాలథిన్ కాగితంలో ఓ పటంలా చేసి తీసుకెళ్ళాను. కాసేపు దానివంక చూసి, "ఒరేయ్, నువ్వు బొమ్మలు కాదు కానీ, పాటలు వ్రాయరా" అని చెప్పింది. నా చేతుల్లో బాబా పడ్డ అవస్థ చూసి భరించలేక పోయినట్లుంది. ఆ తరువాతి కాలంలో కవితలు వ్రాయటం మొదలుపెట్టాను. 2013లో 'అంతర్యానం' అనే నా కవితా సంకలనం కూడా ప్రచురించాను. సరే, ఇది వేరే విషయం.

నండూరు వెళ్ళినప్పుడు కనీసం ఒక్క రోజైనా, మా చేత పూజ చేయించకుండా తిరిగి పంపలేదు అమ్మమ్మ. ముందు వినాయకుడికి పూజ, తర్వాత బాబాకు అభిషేకం, ఆ తర్వాత బాబాకు షోడశోపచారపూజ. అలా ఓ రోజు వినాయకుడికి పూజ చేయిస్తున్నప్పుడు వినాయకుడి అష్టోత్తరం నేను కూడా చదవటం మొదలేసాను. కొన్ని నామాల తర్వాత వినాయక అష్టోత్తరంనుంచి బాబా అష్టోత్తరానికి దూకేసాను, తెలియకుండానే. అమ్మమ్మ గమనించి సరిచేసింది.

ఇది ఒక సందర్భంగా తీసుకొని, వినాయకుడిని ప్రసన్నం చేసుకునే మంత్రం చెప్పమని విసిగించాను. "మంత్రం కాదుగానీ, రోజూ స్నానం చేసిన తర్వాత ఓ మడిబట్ట కట్టుకొని, బియ్యప్పిండి, బెల్లంతో ఓ ఉండ్రాయి చేసి రోజూ వినాయకుడికి నివేదన చేయమని" చెప్పింది. అప్పటినుంచి (1982) ఇప్పటిదాకా

దాదాపు 34 సంవత్సరాల నుంచి చేస్తూనే ఉన్నా. అప్పటికి ఆ సలహా చిన్నపిల్లలకు భక్తిభావన పెంపొందించటానికి ఉద్దేశించిందిగా అనిపించినా, అదీ సాధనలో ఓ భాగమని తర్వాత తెలిసింది!

"త్వం మూలాధార స్థితోసి నిత్యం" అని శృతి చెప్పిన రహస్యం. మూలాధార చక్రానికి అధిపతి వినాయకుడు. మూలాధారం చైతన్యవంతం కానంతవరకూ ఆధ్యాత్మిక సాధనలో పురోగతి ఉండదు. బహుశా రాబోయే కాలంలో సాధనా మార్గంలో నా ప్రవేశానికి పునాదులు వేయుటానికే అమ్మమ్మ అలా సంకల్పించిందేమో అని అనిపిస్తుంది.

1990లో తిరుపతి ఈనాడు తర్వాత ఢిల్లీ వెళ్ళి ఉద్యోగం చేసుకునే అవకాశం వచ్చింది. అప్పుడు అమ్మమ్మ ఆశీర్వాదం తీసుకోటానికి వెళ్ళినప్పుడు, "ఇంకా ఎంతకాలం వినాయకుడికి ఉండ్రాయి" పెట్టాలి అని అడిగా. కాసేపు ఆలోచించి "నీకు కలలో ఏనుగు కనిపించేదాకా పెడుతూనే ఉండమని" చెప్పింది. ఎన్నోసార్లు నిద్రపోయే ముందు అనుకొని పడుకున్నా, ఏనుగు మాత్రం 2012-13 దాకా కలలోకి రాలేదు!

అమ్మమ్మ ఉద్దేశించిన సంకల్పానికి, ఈ కలకు సంబంధం ఉన్నదో లేదో తెలియదు కానీ, ఆ విచిత్రమైన కలకు అంతకుమించిన అద్భుతమైన విశ్లేషణ కూడా నా మిత్రుడు రఘూత్తమరావుగారు చేసారు.

స్థూలంగా కల ఏమిటంటే, నేను సాక్షీభూతంగా నిలబడి ఉన్నాను. ఎదురుగా ఒక ఏనుగు. ఆ ఏనుగు గుదంలోకి ఒక్కసారిగా ఓ సింహం దూసుకు పోయి నోటినుంచి వచ్చే ప్రయత్నం చేస్తున్నది. దానికి రఘుగారు ఇచ్చిన విశ్లేషణ ఇలా ఉంది. సాధారణంగా సింహం ఓ క్రూరజంతువుగా భావిస్తూ ఉంటాము. కానీ, సాధనామార్గంలో సింహం ఆనందానికి, సంతృప్తికి చిహ్నం (contentment).

అదెలాగంటే, ప్రతి జీవికి ఆహారం, నిద్ర, భయం, మైధునం అనేవి సహజాతి సహజమైన దేహలక్షణాలు. కానీ, సింహం మాత్రం ఆకలి వేసినప్పుడే వేటకు వెళుతుంది. నిద్రలో ఉన్నా ఏ మాత్రం ఏమరుపాటులేని లక్షణం దీనికి సొంతం. భయం ఏ మాత్రమూ లేని ఒకే ఒక్క జీవి సింహం. అలాగే, ఋతువు ననుసరించి మైధునానికి సిద్ధమౌతుంది. ఈ దేహలక్షణాలన్నిటికీ పూర్తిగా వ్యతిరేకం ఇతర

జీవులు. బుద్ధిజీవులమనుకునే మానవులం మనమూ అంతే! కాబట్టి, జీవితంలో లభిస్తున్న ఆనందాన్ని అనుభవిస్తూ సంతృప్తిగా ఉంటూ సాధన చేసుకోవాలని ఆయన విశ్లేషించారు. నిజానికి, అప్పటికి రావలసిన ప్రమోషను రాక అస్థిమితంగా ఉన్న రోజులు. అటువంటి సమయంలో ఈ కల నాకో ప్రేరణగా నిలిచిపోయింది.

ఈ సందర్భంలోనే మరో విషయం ప్రస్తావించాలి. న్యాయంగా రావలసిన ప్రమోషను రాలేదని మా బాసుమీద తిరగబడ్డా. గురువుగారికి కూడా చెప్పి బాధపడ్డా. అంతా విని ఆయన కొన్ని మాటలు చెప్పారు. "ప్రమోషన్ వస్తే ఏమౌతుంది? మేనేజర్ అవుతారు. ఇంకా జీతం కొద్దిగా పెరుగుతుంది. సరే, ఇంతకి మీకు షోడశి ఇచ్చా కదా?" అప్పటికి కానీ, నాకు అర్థం కాలేదు. ఏ విద్యకోసం కొన్ని కోట్ల జన్మలు ఎత్తాల్సి వస్తుందో, ఆ విద్య ఇచ్చారు గురువుగారు. అంతకుమించిన ప్రమోషనా మేనేజరు పదవి? దానికోసమా, నేనింతగా తపించింది?

ఏదేమైనా, ఆఫీసు పని మీద ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చినా, నా బదులు నా శ్రీమతి ఉంద్రాయి బాధ్యత నిర్విఘ్నంగా కొనసాగేందుకు తోడ్పాటు నందిస్తూ ఉంది.

✲

# అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం

**అ**మ్మమ్మ చెప్పిన ఆ విషయాన్ని ఏ మాత్రం తప్పకుండా ప్రతి రోజూ మనస్ఫూర్తిగా ఆచరించేవాడిని. అమ్మమ్మ చెప్పిందంటే మంచికే కదా అన్న ఓ దృఢనమ్మకం. ఆఫీసు పనిమీద వేరే ఊళ్ళకు వెళ్ళినప్పుడు ఉండ్రాయి చేయటం కుదరకపోయినా, కూడా తీసుకెళ్ళే చిన్న బాబా పటానికి మాత్రం ఏదో ఒకటి నివేదించేవాడిని. ఇప్పుడు చెప్పబోయే విషయం 1994–95 మధ్య జరిగింది. అప్పటికి నాకింకా పెళ్ళి కాలేదు. అప్పుడు మా ఆఫీసు దక్షిణ ఢిల్లీలో వసంత్ విహార్‌లో ఉండేది. నేను ఉండే ఫ్లాటు తూర్పు ఢిల్లీలోని పట్‌పడ్‌గంజ్ ఉండేది. నాకు చాలా ఇష్టమైన పళ్ళు అరటిపండు, మామిడిపండు. అరటిపళ్ళు దాదాపు ప్రతికాలంలోనూ దొరికేవి కాబట్టి, ఇంట్లో స్టాకులోనే ఉండేవి. ఉదయం ఉండ్రాయితోబాటు ఓ అరటిపండు కూడా నైవేద్యంగా పెట్టి ఆఫీసుకు వెళ్ళేవాడిని. ఈ ప్రసాదాన్ని మరునాడు ఉదయం ఆఫీసుకు వెళ్ళేప్పుడు తినేవాడిని. ఏ రోజూ పూజగదిలో దేవుడి ముందు నైవేద్యం లేకుండా ఉండేదికాదు.

అలాంటి ఒక రోజు, ఆఫీసుకు వెళ్ళేముందు అరటిపండు తిందామని చూస్తే, ఎవరో కొద్దిగా తిన్నట్లుగా కనిపించింది. ఇంకేముంది, బాబాయే వచ్చి తింటున్నాడన్న ఆనందంతో ప్రసాదంగా ఆ అరటిపండు తినేసా. అలా రెండు మూడు రోజులు వరుసగా జరిగింది. ఆ వారాంతం ఇంట్లో ఉండి ఉండక పోయుంటే బహుశా అలానే ఆనందంగా ఉండేవాడినేమో!

ఆ శనివారం చూసిందేమిటంటే, రోజూ ఓ ఎలుక వచ్చి నైవేద్యంగా పెట్టిన అరటిపండుని తోచినంత తిని వెళుతున్నది. ఒక్కసారిగా చిరాకేసింది. దానికితోడు గత మూడు రోజుల నుంచి ఎలుక ఎంగిలి చేసిన అరటిపండు తిన్నానన్న నిజం కొద్దిగా అసహ్యంగా అనిపించింది. ఇక ఆ రోజునుంచి నైవేద్యంగా పెట్టిన ఉండ్రాయి, అరటిపండు ఆ వెంటనే తినటం మొదలేసాను. ఎలుకని ఇంటినుంచి తరిమేసేదాకా, అలానే చేయాలని నిశ్చయించుకున్నా. దానివల్ల దేవుడి దగ్గర నైవేద్యం లేకుండా పోతున్నా పట్టించుకోలేదు. అలా ఓ మూడు రోజులు గడిచాయి.

నాలుగో రోజు ఆఫీసునుంచి ఇంటికి వచ్చే దోవలో ఐ.టి.ఓ. బ్రిడ్జి దగ్గర ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సిగ్నల్ కోసం ఆగాల్సి వచ్చింది. సిగ్నల్ కాకుండా పోలీసే ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ ఉండటం వల్ల ఇంకా ఆలస్యమౌతున్నది. ఇంతలో ఓ ముసలి వ్యక్తి దగ్గరకి వచ్చి"బేటా! తీన్ దిన్‌సే ఖానా నహీ ఖాయా. కుచ్ పైసా దో" అని అడిగాడు. వెంటనే స్ఫురించింది. నేను కూడా మూడు రోజులనుంచి బాబా దగ్గర నైవేద్యం ఉంచటం లేదని. ఒక్కసారిగా ఆనందం వేసింది అలానే అయ్యో అని కూడా అనిపించింది.

అతని వేషం అచ్చు భిక్షాటనకి వెళుతున్న బాబా ఫొటోలో ఉన్నట్లుగానే ఉంది. నెత్తిమీద నుంచి భుజాలు దాటుతున్న ఓ గోనెపట్టా, చేతిలో ఓ లోటా. వచ్చిన వ్యక్తి బాబానే అయ్యుంటాడనే అనుమానం కూడా కలిగింది. అయినా చూడండి దౌర్భాగ్యం. ఎక్కడో మూల మరో అనుమానం! జేబులో దాదాపు అయిదు వందలు ఉన్నా, పిసినారితనంతో పదిరూపాయలు తీసి అతని డబ్బాలో వేసా. కొన్ని క్షణాల తర్వాత తెలివొచ్చింది. నా పిసినారితనానికి నాకే సిగ్గొచ్చి దగ్గరలోనే ఆ ముసలతను ఉన్నాడేమో అని చూసా. వెనక్కి తిరిగి చూస్తూ అతను రోడ్డు దాటటం, ఇక్కడ పోలీసు మాకు సిగ్నల్ ఇవ్వటం ఒకేసారి జరిగాయి.

ఎంత విచిత్రమో గమనించండి. అలా వచ్చి డబ్బులు అడిగింది బాబా అయ్యుంటాడనే అనుమానమే కలిగింది కానీ, వచ్చింది బాబాయే అన్న నమ్మకం కలగలేదు. ఎన్ని సంవత్సరాలు పూజలు చేసినా, సాధనలు చేసినా ఆ నమ్మకం లేనప్పుడు అవన్నీ వ్యర్థమే కదా! చిత్తం బాబామీద, భక్తి అరటిపండు మీద ఉన్న నా పరిస్థితికి నన్ను నేను క్షమించుకోలేకపోయా. పది రూపాయలు ఇచ్చినందుకు ఆనందించాలా, పది రూపాయలే ఇవ్వగలిగినందుకు సిగ్గు పడాలా! సంపాదిస్తున్న

ప్రతి పైసా ఆయన పెట్టిన భిక్షే, అయినా ఆయనకు ఇవ్వటానికి మనస్కరించక పోవటం ఏమిటి! జన్మ సంస్కారాలు ఇలానే ఉంటాయేమో! మనలని సంస్కరించటానికి బాబా పెట్టే పరీక్షలేమో!

మళ్ళీ 'అంతా బాబాయే చూసుకుంటాడు' అన్న అమ్మమ్మ గుర్తుకొచ్చింది. ఎందుకు చూసుకోడు? అమ్మమ్మ మాటా మజాకా? నేను చేసిన తప్పు సరిదిద్దటానికి నడుచుకుంటూ వచ్చిన ఆ బాబా ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తూనే ఉంటాడు.

'అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరం। తత్పదం దర్శితేన తస్మైశ్రీ గురవే నమః॥' అనంతము, అఖండము అయిన సృష్టిలోని కదిలే ప్రాణిలోను, వస్తువులోను, కదలని ప్రాణిలోను, వస్తువులోను ఉండే బ్రహ్మ యొక్క నిజాన్ని తెలిపే గురువుకు నా నమస్కారములు.

✲

# ఈశావాస్య మిదగ్ం సర్వం

అది 1992వ సంవత్సరం అనుకుంటాను. అమ్మమ్మ పరమపదించటానికి దాదాపు ఒక సంవత్సరం ముందటి సంగతి. షావాలెస్ అనే లిక్కర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, ఢిల్లీలోని జనక్‌పురిలో ఉంటున్న రోజులు. కంపెనీ వ్యాపారం ఏ మాత్రమూ సరిగా లేదు. ఉద్యోగభద్రత ప్రశ్నార్థకంగా ఉన్న పరిస్థితి. వేరే ఉద్యోగానికి ప్రయత్నం చేస్తున్న సమయం కూడా. సెలవురోజైన ఓ శనివారం ఉదయం ఈ ఆలోచనలతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో సాయిబాబాకు మొక్కుకున్నా. పరిస్థితులు చక్కబడాలని, అందుకుగాను మూడు సంవత్సరాలు నాకెంతో ఇష్టమైన మామిడిపళ్ళు వదిలేయాలని నిర్ణయించుకున్నా. ఈ మొక్కుకు అనుగుణంగా, అప్పటికప్పుడు బైటకు వెళ్ళి ఒక కిలో మామిడిపళ్ళు (మూడు పళ్ళు వచ్చాయి) కొని, మా ఇంటికి దగ్గరలోని ఓ గురుద్వారా ఆవరణలో కూర్చున్న ఓ ముసలావిడకు ఇచ్చి ఇంటికి వచ్చాను. అప్పటికి ఆ విషయం అక్కడితో ముగిసింది. నేను రొటీన్ ఇంటిపనిలో నిమగ్నమయ్యా.

ఓ నాలుగు రోజుల తర్వాత గుంటూరు నుండి అమ్మ ఉత్తరం వచ్చేదాకా అసలు ఆ మామిడిపండ్ల విషయమే గుర్తులేదు. అమ్మ వ్రాసిన ఉత్తరం సారాంశం ఏమిటంటే, ఆ శనివారమే, చిన్నామ్మా వాళ్ళింట్లో ఉన్న అమ్మమ్మను చూసేందుకు అమ్మ పొన్నూరు వెళ్ళింది. ఓ అద్భుతమైన సమాధి అవస్థలో ఉన్న అమ్మమ్మ, ఉన్నట్లుండి "ఒసేయి నిమ్మాయ్! నేను ఢిల్లీకి వెళ్ళొచ్చా" అన్నదిట. మా అమ్మ (నిర్మల)ను ముద్దుగా నిమ్మాయ్ అని పిలిచేది అమ్మమ్మ. అమ్మమ్మ ఏదో అద్భుతం చేయబోతున్నదని అమ్మకు అర్థమయ్యింది. "సరే వెళ్ళావుగానీ, కిష్టిగాడు ఎలా

ఉన్నాడు" అని అమ్మ అడిగింది. మా ఇంట్లో అందరూ నన్ను కిప్పి అని పిలుస్తారు. "వాడికేం, బాగానే ఉన్నాడు. నాకు మూడు మామిడిపళ్ళు ఇచ్చాడు తెలుసా?" అని చెప్పిందట అమ్మమ్మ. అమ్మ ఊరుకోకుండా, "వాడు మామిడిపళ్ళు ఇస్తే తిని వచ్చావా? నువ్వు వాడికేమీ ఇవ్వలేదా?" అని అడిగింది. "ఎందుకు ఇవ్వలేదు, ఆంజనేయస్వామి లాకెట్ ఇచ్చాగా!" అన్నదిట అమ్మమ్మ!

అమ్మమ్మను అప్పటికే ఓ మహాయోగినిగా భావించే నాకు, అమ్మమ్మ నా దగ్గరనుండి మామిడిపళ్ళు తీసుకున్న విషయం చెప్పినా ఆశ్చర్యం కలగలేదు కానీ, లాకెట్ విషయానికి వచ్చేసరికి పట్టలేని ఆనందం కలిగింది. నిజానికి, ఆ శనివారమే, ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, పాత సామానంతా తీసి శుభ్రం చేసుకుంటుంటే, నేను ఢిల్లీకి వచ్చిన కొత్తల్లో గుంటూరు నుంచి తెచ్చుకున్న మా రమక్క సూట్‌కేసు కనిపించింది. పనిలోపనిగా, ఆ సూట్‌కేసు కూడా సర్దుతుంటే, మా అక్క చిన్నప్పుడు ఒంట్లో బాగోలేకపోతే అమ్మమ్మ ఇచ్చిన రాగితో చేసిన ఆంజనేయస్వామి లాకెట్ కనిపించింది. అలా సూట్‌కేసులో వదలటం దేనికని, అది తీసుకొని మెళ్ళో కట్టుకున్నా!!

అసలు ఈ సంఘటన కేవలం యాదృచ్ఛికమని కొట్టేయగలమా? ఆధ్యాత్మికంగా నాలో ఎన్నెన్నో మార్పులకు ఈ సంఘటన తోడ్పడింది. నేను వేసే ప్రతి అడుగులోను, తిరిగే ప్రతిమలుపులోను తోడు ఉన్నానంటూ అమ్మమ్మ నాకు ఇచ్చిన నమ్మకం ఇది. కనీసమాత్రంగానైనా మిగిలి ఉన్న అనుమానాలు పటాపంచలు చేసిన సందర్భం ఇది. మరింత కఠినమైన ఆధ్యాత్మికమార్గానికి నన్ను సన్నద్ధం చేసిన పర్వదినం ఇది.

మొదట మూడు సంవత్సరాలు అనుకున్నా, ఎప్పటికప్పుడు ప్రతి సంవత్సరం మామిడిపళ్ళని వదిలేయటం జరిగింది. దాదాపు 22 సంవత్సరాల తర్వాత, 2014లో మా గురువుగారు ప్రత్యేకంగా తినమని మామిడిపళ్ళు చేతిలో పెట్టినప్పటినుండి ఈ దీక్ష విరమించటం జరిగింది.

ఈ విశ్వమంతా ఈశ్వరుని నివాసమని 'ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్' అనే ఉపనిషద్వాక్యం చెబుతున్న సత్యం కూడా ఇదేనేమో! మహాయోగినిగా అమ్మమ్మ సర్వవ్యాపకత్వం అనుభవపూర్వకంగా తెలిసింది.

✲

# మృత్యోర్మా అమృతంగమయా

**మూ**డు నాలుగేళ్ళ క్రితం సంగతులివి. సాధనలో కొన్ని ఇబ్బందులు ఎదురైనాయి. చాలావరకు ఆ ఇబ్బందులు గురువుగారితో చెప్పుకోవటం ఆయన సూచించిన ప్రకారం వాటిని అధిగమించటం జరిగేది. రెండు సమస్యలు మాత్రం అమ్మమ్మకు నివేదించుకున్నాను. వాటిలో మొదటి సమస్యకు సమాధానంగా ఒక రాత్రి కలలో కనిపించి నండూరు వెళ్ళి శ్రీదత్తాత్రేయస్వామికి, శ్రీకృష్ణుడికి అభిషేకం చేయమని చెప్పింది.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే, నాకు తెలిసినంతలో నండూరు మందిరంలో వినాయకుడి విగ్రహం, బాబా విగ్రహం, పాదుకలు తప్పించి దత్తాత్రేయస్వామి, శ్రీకృష్ణుడు లేరు. అదే విషయం, ఓరోజు ఫోనులో అమ్మతో ప్రస్తావించాను. అప్పుడు అమ్మ చెప్పిన నండూరు విశేషాలు విన్న తర్వాత ఆశ్చర్యం, ఆనందంతో తబ్బిబ్బయ్యాను. అమ్మమ్మ నాకు కలలో సూచించిన పరిష్కారానికి కొన్ని నెలలముందు, నండూరు సాయిబాబా మందిరం ఎదురుగా ఓ కళ్యాణమంటపంలా పెద్దనాన్నగారు (కీ.శే. అన్నంరాజు రామారావుగారు) కట్టించారట! అందులో శ్రీదత్తాత్రేయస్వామి, శ్రీకృష్ణుడి విగ్రహాలు కూడా పెట్టారట.

ఆ వెంటనే నండూరు వెళ్ళి పెద్దల అనుమతి తీసుకొని కొత్తగా కట్టిన ఆ మంటపాన్ని తెరిచి చూస్తే, విగ్రహాలు దుమ్ము కొట్టుకుపోయి కనిపించాయి. ఎవరూ ఉపయోగించక పోవటంతో ఆ మంటపం మూసివేయబడి ఉన్నదట! నేను వెళ్ళిన రోజే తాళాలు తీసి శుభ్రపరచటం జరిగింది!

విచిత్రం ఏమిటంటే, అమ్మమ్మ కలలో కనబడినప్పుడు ఎన్నో విషయాలు చెప్పినట్లు మాత్రమే గుర్తుంటుంది. కానీ, నిద్రలేచిన తర్వాత, మనకెంతవరకు అవసరమో అంతవరకే గుర్తుంటుంది! అలానే, మరో సమస్య అమ్మమ్మకు నివేదించుకున్నాను. దానికి అమ్మమ్మ చూపిన పరిష్కారం అద్భుతమనే చెప్పుకోవచ్చు.

అమ్మమ్మ చెప్పిన పరిష్కారం చాలా అంటే చాలా సింపుల్! నండూరు వెళ్ళి రాఘవయ్యను కలవమని చెప్పింది. నేను కూడా ఏదో తెలిసినట్లుగా, వీర రాఘవయ్యనా అని అడిగితే, అవును అని బదులిచ్చింది. నిద్రమత్తు వదిలిన తర్వాత, అమ్మమ్మ చెప్పిన విషయాల్లో రాఘవయ్య వరకు తప్పించి ఇంకేమీ గుర్తుకు రాలేదు. ఈ రాఘవయ్య ఎవరు? ఆయనకి నా సమస్యకి సంబంధం ఏమిటి? ఆయనతో ఏం మాట్లాడాలి? ఏమని అడగాలి? అన్నీ సందేహాలే! శ్రీ తాడేపల్లి రాఘవశాస్త్రిగారి గురించి అయితే విన్నాను. ఆయననే చందోలు శాస్త్రిగారు అని పిలిచేవారు. ఆయన ఒక సిద్ధపురుషుడు. ఆ మధ్య చందోలులోని బండలమ్మ గుడి చూసి రమ్మని కూడా చిన్నమామయ్య చెబితే వెళ్ళివచ్చాము. మరి ఈయన గురించైతే, నండూరులో కలవమని ఎందుకు చెబుతుంది అనే విషయం అర్థం కాలేదు.

ఆ తర్వాత కొన్ని రోజులకే గుంటూరు వెళ్ళటం తటస్థించింది. అమ్మకు ఈ విషయం విపులంగా చెప్పి, ఈ రాఘవయ్య ఎవరు అని అడిగా. అమ్మ చూచాయగా చెప్పింది కానీ ఖచ్చితంగా చెప్పలేకపోయింది. పెద్దమామయ్యను అడిగితే బహుశా తెలిసే అవకాశం ఉంటుందని అమ్మ చెప్పింది. చివరికి పెద్దమామయ్యే చెప్పారు ఈ రాఘవయ్యగారి గురించి. నండూరులో శివాలయం పక్కన ఈయన ఉండేవారట! ఈ రాఘవయ్యగారు సిద్ధిపొందిన ఒక యోగి అని, యోగసాధనలో అత్యున్నతస్థితికి చేరినవారుగా ఆయన గురించి ఆ రోజుల్లో చెప్పుకునేవారని, అలానే ఈ రాఘవయ్యగారికి, అమ్మమ్మవాళ్ళ అత్తగారికి యోగపరమైన చర్చలు చాలా జరిగేవట!

ఒక ఆదివారం పొద్దున్నే గుంటూరు నుండి బయలుదేరి, తొమ్మిది గంటలకల్లా నండూరు చేరాము. అంత పొద్దున్నే వెళ్ళినా, విచిత్రంగా సాయిబాబా మందిరం తాళం పెట్టి ఉంది. అక్కడ ఉన్నవాళ్ళను అడిగితే, పూజారిగారికి

ఏదో పని ఉండి గుంటూరు వెళ్ళారని చెప్పారు. ఎవరి దగ్గరా మరో తాళంచెవి లేదు. ఇక చేసేదేముందని, బాబాని బయటనుండే దర్శించి రాఘవయ్యగారి గురించి అక్కడివారిని అడుగుతూ వెళ్ళాం. బాబా మందిరం ఉన్న అదే వీధిలో కొద్దిదూరంలో పాతశివాలయం ఉంది. ఆ గుడిపక్కనే, ఒక ఆశ్రమం ఉంది. ఆ ఆశ్రమంలో రాఘవయ్యగారిది, ఆయన కుమారుడిది రెండు విగ్రహాలు ఉంచి రాఘవయ్యగారి మనుమడు పూజలు నిర్వహిస్తున్నారు. అక్కడే, కాసేపు ధ్యానంలో కూర్చొని, ఎందుకు ఎలా ఈయన దర్శనానికి వచ్చింది ఆయనకు చెప్పుకొని తిరిగి వచ్చేసాము.

ఏదేమైనా, మరోసారి చందోలు వెళ్ళి, శ్రీ శాస్త్రిగారి గురించి వాకబు చేయాలి అని కూడా ఉంది.

✲

# కిష్కింధకాండ

**19**78 నాటి సంగతి. నేను గుంటూరు లీలామహల్ దగ్గర ఉన్న మునిసిపల్ స్కూల్లో అయిదో తరగతిలో ఉన్నాను. మా హెడ్మాస్టర్ ఫ్రాంక్లీన్‌గారే మా క్లాసు టీచరు కూడా. నాలుగు గదులు, చావడి, పైన పెంకులతో కప్పు. ప్రతి గదికి రెండువైపులా పెద్దపెద్ద కిటికీలు. స్కూలు చుట్టూ చెట్లతో నిండి ఉండేది. అలాగే, ఆడుకోటానికి స్కూలు భవనం చుట్టూ బోలెడంత స్థలం. అన్ని ప్రభుత్వపాఠశాలలలాగానే మురికికూపంలా ఉండేది. స్కూలు బయట పెద్ద మురికి కాలువ. కుక్కలు, పందులతో ఆ స్కూలు రోడ్డు కూడా బీభత్సంగా ఉండేది. స్కూలు, ఆవరణ ఎలా ఉన్నా అక్కడి టీచర్లు చాలావరకు అనునయంగానే ఉండేవాళ్ళు. అందులోనూ, ఫ్రాంక్లీను మాస్టరుగారంటే మాకు ప్రత్యేకించి అభిమానం కూడా.

ఆ రోజు, స్కూలు ఆవరణలోకి కోతులు వచ్చాయి. మాస్టారుగారు వెంటనే గమనించి క్లాసులో ఉన్న మమ్మల్నందరినీ భయపడవద్దని ధైర్యం చెబుతూ, జాగ్రత్తలు చెబుతున్నారు. ఒకవేళ కోతులు లోపలికి వచ్చినా ఎవ్వరూ కూర్చున్న చోటునుంచి కదలొద్దని, అప్పుడు వాటంతట అవే వెళ్ళిపోతాయని ఆయన చెప్పారు. చివరికి ఆయన అనుకున్నంతా అయ్యింది. ఒక కోతి సరాసరి మా క్లాసులోకి వచ్చేసింది. అప్పటిదాకా, మాస్టారుగారు చెప్పిన విషయాలన్నీ బుద్ధిగా వింటున్న పిల్లలంతా ఒక్క ఉదుటున లేచి మాస్టారుగారు నుంచున్న బోర్డువైపుకు వెళ్ళిపోయారు. నేనొక్కడినే కదలకుండా కూర్చున్నాను. మనసులో బితుకు బితుకుమంటూనే ఉంది. నెమ్మదిగా ఒక కోతి నా దగ్గరకి వచ్చి, నెత్తిన చేయి

పెట్టింది. ఏం చేయాలో తెలియక కదలకుండా మెదలకుండా అలానే కూర్చున్నా. ఎదురుగా మాస్టారుగారు కంగారుపడిపోతున్నారు. ఆ కోతి ఏం చేస్తుందో అని భయం భయంగా చూస్తున్నట్లు అనిపించింది. దాదాపు ఓ నిముషం తర్వాత కోతి వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా ఊపిరి పీల్చుకొని, అదాటున నా దగ్గరకి వచ్చారు మాస్టరుగారు. "ఏరా చిట్టీ! (ఆయన నాకు పెట్టిన ముద్దు పేరు చిట్టి) అందరూ పరుగెత్తి అటువైపుకు వెళ్తే, నువ్వొక్కడివే అలా ఎందుకు కూర్చున్నావని" మందలింపుగా అడిగారు ఆయన. "మీరే చెప్పారు కదండి, కదలకుండా కూర్చుంటే అదేమీ చేయదని" అని నా సమాధానం. ఉన్నపళాన, నన్ను కౌగిలించుకొని ఆయన ఏడ్చేసారు. అప్పటి నా వయసుకు ఆయన భయపడి ఏడ్చారనుకున్నా కానీ, ఆ కన్నీళ్ళు నేను ఆయన మాటమీద చూపిన నమ్మకాన్ని ఆశీర్వదించిన అమృతబిందువులని అప్పటికి తెలియదు.

అసలీ విషయం ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ఈ కథకు కొసమెరుపుగా అమ్మమ్మ నాకు చేసిన ఉపదేశం ఏమిటన్నది తెలియాలిగా! ఈ విషయమంతా అమ్మమ్మ గుంటూరు వచ్చినప్పుడు చెప్పా. "ఏంటీ స్కూల్లో కిష్కింధకాండ చేసారా" అని హాయిగా నవ్వేసి "ఆంజనేయస్వామి ఆశీర్వదించాడురా. చక్కగా ప్రతిరోజు హనుమాన్ చాలీసా చదువుకో" అని చెప్పింది. అప్పటికి హనుమాన్ చాలీసా రాదు. ఆ తర్వాత ఓ రెండు సంవత్సరాల కనుకొంటాను నందూరు వెళ్తే హనుమాన్ చాలీసా విషయం ప్రత్యేకించి అడిగింది అమ్మమ్మ. దాదాపు నా ఏడవ తరగతినుండి (1980) ఆపకుండా 25 సంవత్సరాల పాటు రోజుకు ఇన్ని అని లెక్కలేకుండా హనుమాన్ చాలీసా జపించాను. దాదాపు రోజల్లా ఏ పని చేసినా అదే జపం. కనీసం రోజుకు వందపైనే చేసేవాడిననుకుంటా. ఇప్పటికీ హనుమాన్ చాలీసా చదవటం మానలేదు.

భగవంతుని పాదాలని సంస్కృతంలో 'కిష్కి' అంటారని ఈమధ్యే తెలిసింది. భగవంతుని శరణాగతి చేసేవారిని కిష్కింధః అంటారు.

✲

# ఓం శాంతిః శాంతిః శాంతిః

**నే**ను ప్రస్తావించిన అనుభవాలే కాక, ఇంకా చాలా ఉన్నాయి. కొన్ని చాలా వ్యక్తిగతమైనవి కనుక వాటిని నా వరకే పరిమితం చేసుకుంటున్నాను. వినాయకుడికి ఉండ్రాయి పెట్టమని చెప్పినా, హనుమాన్ చాలీసా చదువుకోమని చెప్పినా, అనుష్ఠానం మరచిపోవద్దని చెప్పినా, బాబాను ధ్యానించి నిర్ణయాలు తీసుకోమని చెప్పినా అవన్నీ నాకు అవసరమైన, అనువైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించటానికే కాక, భవిష్యత్తులో నా సాధనను సుగమం చేయటానికి అమ్మమ్మ చేసిన సాయంగానే భావిస్తాను. ఇప్పటికీ జప, హోమాలు చేసుకునేప్పుడు కొన్ని సెకన్ల పాటు అమ్మమ్మ దర్శనం ఇస్తూనే ఉంది. అయినప్పటికీ, అమ్మమ్మ భౌతికంగా లేని లోటు ఇప్పుడు బాగా తెలుస్తున్నది.

2015 సంవత్సరం షిర్డీలో కలిసినప్పుడు బుడ్డిగాడు (మునిపల్లె శివరామకృష్ణ) ఏదో మాటల సందర్భంలో "... ఏముందన్నా, అమ్మమ్మను నమ్ముకుని, అమ్మమ్మ చూపినబాటలోనే నడుద్దాం..." అన్నాడు. నిజానికి, ఒక్క బుడ్డిగాడే కాదు, విజయవాడలో బాబు (అయ్యదేవర వేంకట సాయి దుర్గా రామవరప్రసాద్) కూడా అదే మాట అన్నాడు. ఇంకా చాలామంది అదేమాట అన్నారు. ఎన్నెన్నో ఆలోచనలు, అనుమానాలు, ఒక్కసారి తేనెతుట్టె కదిలినట్లయ్యింది. అమ్మమ్మ ఎవరికైనా తనదంటూ ఓ బాట ఉందని, ఆ బాటలో నడవమని చెప్పిందా? ఆ బాట ముక్తిసోపానమని చెప్పిందా? అసలు అమ్మమ్మ

నడిచిన బాట ఏమిటి? అదేమిటో తెలిసినా మనం అమ్మమ్మలా నడవగలమా? మనకా ధైర్యం, స్థైర్యం ఉన్నాయనే అనుకుంటున్నామా?

ఇవి అర్థమవ్వని ప్రశ్నలే కాని, అర్థంలేని ప్రశ్నలైతే మాత్రం కావు. నిజానికి వీటి జవాబులు ఎవరికివారు వెతుక్కోవాలి. ఒకరికి అందిన జవాబు, మరొకరికి బహుశా సరిపోకపోవచ్చు. అయితే, దీనికోసం మన లోతుల్లో మనం చూసుకోవటం అవసరం. అలాంటి సందర్భమే ఈ రచన కూడా. నా లోతుల్లోకి నన్ను చూసుకునే ప్రయత్నమే ఇది. ఆచరణలో ఆధ్యాత్మికతను ప్రస్ఫుటించిన అమ్మమ్మ జీవితం మనం మనలని తరచి చూసుకునే అద్దం కావాలనే ఆశయంతో మాత్రమే ఈ పుస్తకాన్ని వ్రాయటం జరిగింది. ఈ పుస్తకాన్ని అలానే చదవాలని నా విన్నపం.

అమ్మమ్మని ఒక అమ్మమ్మలా చూడటమా, ఓ ఆధ్యాత్మిక గురువులా భావించుకోవటమా అనేది మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్న. అమ్మమ్మ మహిమల గురించి ప్రత్యేకించి మనం లోకానికి చాటిచెప్పాల్సిన అవసరం లేదు.

ఒకసారి సందేశం ఇస్తూ జిళ్ళెళ్ళమూడి అమ్మగారు ఓ మాట అంటారు. "నువ్వు కోరితే కోరింది ఇస్తాను. కోరికలేవీ లేకపోతే, నీకు అవసరమైనది ఇస్తాను" అని. నిజమైన ఆత్మనివేదనతోనే కోరికలను జయించటం సాధ్యమౌతుంది. అన్నీ దేవుడే చూసుకుంటాడులే అని మనమే అనుకుంటున్నప్పుడు, నాకు ఇది కావాలి, అది కావాలి అని కోరికల చిట్టాలు విప్పుకోవటం దేనికి? మొక్కుబడిగా మొక్కులు తీర్చుకోవటం దేనికి? అవి సాధ్యపడకపోతే ఆ దేవుడినే నిందించటం దేనికి? పోనీ కోరుకున్నవన్నీ జరిగినా, అక్కడితో కోరికలు ఆపుతున్నామా? లేదే?

నిజానికి, సాధన జీవితంలో కేవలం ఒక భాగం మాత్రమే కాదు. జీవితాన్నే ఓ సాధనగా మలచుకోవాలి. అలా మలచుకోటానికి అమ్మమ్మ జీవితం మనకు స్ఫూర్తినిస్తుంది. అద్భుతమైన గురువు అమ్మమ్మను పక్కనే ఉంచుకొని, అడగాల్సిన విషయాలన్నీ గాలికి వదిలి, లేనివన్నీ ఊహించుకొని అవేవో కోరుకోవాలనే ఉబలాటం దేనికి? బాధ్యతగా మన కోరికలు తీరుస్తూనే ఉంటుంది అమ్మమ్మ. అలా అని, ఎప్పటికీ ఐహికపరమైన కోరికలతో మగ్గిపోతుంటే, ఆధ్యాత్మిక ఔన్నత్యం ఎలా సాధ్యమౌతుంది? మనసు విప్పి అడగాలే కానీ, ఆధ్యాత్మికపరంగా మనకి ఇప్పటికీ మార్గదర్శనం చేయిస్తుంది అమ్మమ్మ.

'యోజనానాం సహస్రంతు శనైర్గచ్ఛేత్ పిపీలకా। అగచ్ఛన్ వైనతేయోపి పదమేకం సగచ్ఛతి॥' – నెమ్మదిగా నడుస్తూ చీమ కొన్ని వేల యోజనాల దూరం పోగలదు. కదలకుండా కూర్చుంటే, గరుత్మంతుడైనా ఒక్క అడుగు ముందుకు పోలేదు.

✲



అమ్మమ్మ తాతగారు



బామ్మ తాతగారు



నందూరు సాయిబాబా ప్రతిష్ఠ సందర్భంలో పూజాదికాలు చేస్తూ ...



నండూరు బాబా


సీతతో (చిన్న అమ్మావాళ్ళ అమ్మాయి)
జడ వేయించుకుంటూ...



తిరుపతమ్మతో...











# అమ్మమ్మ

ప్రతి వ్యక్తీ తన జీవితంలో అమ్మ అనే పదాన్ని ఎన్నిసార్లు అంటాడో, అనుకుంటాడో, వింటాడో, చదువుతాడో తెలియదు కానీ, నా వరకూ దాదాపు ప్రతిసారీ అమ్మతోపాటు స్ఫురించేది అమ్మమ్మ. అర్థం చేసుకోలేని ఆ ప్రత్యేకత అమ్మమ్మ దగ్గర ఏముందో! అందరు అమ్మమ్మలు అలానే ఉంటారా లేక మా అమ్మమ్మే అలా ప్రత్యేకమా?

ఎన్నో శిశిరాలని దాటుకుంటూ వచ్చిన వసంతంలా, మరెన్నో చీకట్లు చీల్చుకుంటూ, వెలుగులు వెదజల్లుతున్న విహంగంలా, కల్మషంలేని అమ్మమ్మ చిరునవ్వు ఓ నమ్మకాన్ని ఎప్పుడూ వెలిగించేది. అమ్మమ్మ లేదనుకుంటేనే, ఆనందంగా మొదలైన బాల్యం అకస్మాత్తుగా ఆవిరయ్యిందని అనిపిస్తుంది.

పుస్తకం వెల : రూ. 100/-

JV